సాక్షి 24|7

కర్నూలు


శనివారం 6-1-2018

మహానేత చలువ.. సిద్ధాపురానికి మహర్దశ


రైతుల కలను సాకారం చేసిన వైఎస్సార్



వివరాలు 3లో



- పొరుగునే హెపటైటిస్-సీ
- తెలంగాణ గ్రామాల్లో వేలాది మందికి వ్యాధి
- చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రులకు బాధితులు
- వైద్యం చేయడానికి జంకుతున్న డాక్టర్లు
- ప్రమాదకరం కావడమే కారణం



మాటేసిన మహమ్మారి

పక్కలో బల్లెం ఉన్నట్టే...మన సరిహద్దులోని తెలంగాణ గ్రామాల్లో హెపటైటిస్-సీ మహమ్మారి విజృంభిస్తోంది. రక్తమార్పిడి ద్వారా వచ్చే ఈ వ్యాధి ఆయా గ్రామాల్లో అధికంగా ఉంది. ఇటీవలి కాలంలో వైద్యులు హెచ్ఐవీ, హెపటైటిస్-బీ,సీ వంటి పరీక్షలు తప్పనిసరిగా చేయిస్తుండడంతో ఈ వ్యాధి కేసులు అధికంగా బయటపడుతున్నాయి. ఇది కర్నూలు నగరంలోని వైద్యులకు ఆందోళన కలిగిస్తోంది.

కర్నూలు(హాస్పిటల్):

హెపటైటిస్-సీ అనేది పచ్చకామెర్లలో ఒక రకమైన జబ్బు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే లివర్ సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, అలంపురం, ఐజ ప్రాంతాల్లోని వావిలాల, వెంకటాపురం, వెంకటాపురం స్టేజ్, మాన్‌దొడ్డి, జంషెడ్, మేడికొండ, కొంకల, తనగల, పచ్చర్ల, తుమ్మిర్ల, తాండ్రపాడు, జులేకల్, రామాపురం, బుడ్డమార్స్, పైపాడు, రాజోలి, ఇటిక్యాల, దరూర్, శాంతినగర్ వంటి గ్రామాల్లో అధికంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కర్నూలు నగరానికి చెందిన వైద్యులు ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్యపరీక్షల్లో ఈ విషయం తేటతెల్లమైంది. ఆయా గ్రామాల్లో

మిగతా 2లో

- 2014-15లో పత్తి కొనుగోళ్ల వ్యవహారం
- ఆదోని యార్డులోనూ అక్రమాలు జరిగినట్లు గుర్తింపు!

యార్డు అధికారుల మెడకు

ఏసీబీ ఉచ్చు!



ఆదోని: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్ల కుంభకోణం కేసు ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు అధికారుల మెడకు కూడా చుట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో పత్తి కొనుగోళ్లకు బాధ్యులుగా ఉన్న అధికారులతో పాటు సీసీఐకి పత్తిని విక్రయించిన వారిలో కొంత మంది (ర్యాండంగా) వివరాలను కూడా జిల్లా ఏసీబీ అధికారులు ఆదోని యార్డు నుంచి తెప్పించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌లో పత్తి ధర

మిగతా 2లో



పందెం కోళ్లు!

- సంక్రాంతి సాక్షిగా అధికార పార్టీలో సీట్ల లొల్లి
- కర్నూలు, ఆళ్లగడ్డలో పోరు షురూ
- కర్నూలు తనదేనంటున్న టీజీ భరత్
- ..కాదు తానే పోటీ చేస్తానని ప్రతి జన్మభూమి సభలో ప్రకటిస్తున్న ఎస్వీ
- ఆళ్లగడ్డ బరిపై ఏవీ సుబ్బారెడ్డి గురి!

సాక్షి ప్రతినిధి, కర్నూలు:

సంక్రాంతి పండుగకు ముందే జిల్లాలో 'పందెంకోళ్లు' రె'ఢీ' అయ్యాయి. వచ్చే ఎన్నికల బరిలో ఉండేది తామేనంటూ ఎవరికి వారు ధీమాగా చెబుతున్నారు. తామే గెలుపు కోళ్లమని కూడా ప్రకటించుకుంటున్నారు. మొత్తమ్మీద అధికారపార్టీలో సీట్ల లొల్లి షురూ

మిగతా 2లో

ఇదేంది తమ్ముడూ?

- వెల్దుర్తిలో ఇసుక మాఫియా గొడవలు
- ట్రక్కుల్లో ఇసుక.. సంచుల్లో డబ్బు
- అక్రమ రవాణాలో టీడీపీ వర్గీయుల ప్రమేయం
- ఆధిపత్యం కోసం తన్నులాట

వివరాలు 3లో



వెల్దుర్తి వద్ద బీడు భూముల్లో డంప్ చేసిన ఇసుక

యార్డు అధికారుల మెడకు
ఏసీబీ ఉచ్చు?

▶ మొదటి పేజీ తరువాయి

దారుణంగా పతనమైంది. క్వింటాలు రూ.3,500కు కొనేనాథుడు కూడా కరువయ్యారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పత్తిని మద్దతు ధరతో సేకరించాలని సీసీఐని ఆదేశించింది. రైతుల పట్టాదారు పాసు పుస్తకాలు, పంట సాగును నిర్ధారించుకుని కొనుగోలు చేయాలని మార్గదర్శకాలలో పేర్కొంది. అయితే .. కొందరు సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు కుమ్మక్కై మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రైతుల నుంచి క్వింటాలు రూ.3,500లు, అంతకు తక్కువ ధరకు కొన్న పత్తినే సీసీఐ అధికారులు క్వింటాల్ రూ.4,050 చొప్పున సేకరించారు. దీంతో అసలైన రైతులకు మద్దతు ధర దక్కలేదు. ఈ అక్రమాలపై విచారణకు కేంద్ర ప్రభుత్వం సీబీఐని రంగంలోకి దించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.650 కోట్ల కుంభకోణం జరిగినట్లు సీబీఐ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో భాగంగా ఆదోని సీసీఐ కేంద్రంలోనూ అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. సీబీఐ కేసు దర్యాప్తు ఇంకా ఓ కొలిక్కి రాలేదు కానీ.. మరో పక్క ఏసీబీ అధికారులు కూడా కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆదోని సీసీఐ కేంద్రంలో జరిగిన కొనుగోళ్లపై విచారణ చేపట్టినట్లు సమాచారం. ఇక్కడ నాలుగు వేల మంది నుంచి ఏడు లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోలు చేశారు. కొందరు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు తక్కువ ధరకు మార్కెట్లో పత్తిని కొనుగోలు చేసి.. రైతుల పేర్లపై మద్దతు ధరతో సీసీఐకి అమ్ముకుని రూ.లక్షల్లో వెనుకేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సీసీఐకి పత్తిని అమ్మినట్లు చెబుతున్న రైతుల్లో ర్యాండంగా కొంత మందిని ఎంపిక చేసుకుని వారి పట్టాదార్ పాస్ పుస్తకాలు, సీసీఐ టోకెన్ నంబరు, పత్తి పంట సాగు వివరాలు, ఆ రైతులు ఎన్ని క్వింటాళ్లు, ఎన్ని సార్లు అమ్ముకున్నారో పూర్తి వివరాలను సమర్పించాలని ఏసీబీ అధికారులు..యార్డు అధికారులను కోరారు. ఆ సమయంలో పత్తి కొనుగోలుకు బాధ్యులుగా ఉన్న వారి వివరాలను కూడా పంపాలని సూచించారు. దీంతో యార్డు అధికారులు ఏసీబీ అధికారులు కోరిన మేరకు ఇటీవలే వివరాలు సమర్పించినట్లు తెలిసింది. కాగా.. ఏసీబీ అధికారులు ర్యాండంగా ఎంపిక చేసిన వారిలో కొంతమంది కమీషన్ ఏజెంట్లు ఉండగా.. మరి కొందరి వివరాలు బోగస్‌గా తేలినట్లు సమాచారం. అలాగే కొంత మందివి పట్టాదార్ పాస్ పుస్తకాలు, టోకెన్, పంట సాగు వివరాలు యార్డు రికార్డుల నుంచి మాయమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆదోనిలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఏసీబీ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేసే అవకాశం ఉండడంతో అక్రమార్కుల్లో గుబులు రేగుతోంది.

వేలిముద్రలు పడనివారికి
వీఆర్‌ఓ ద్వారా సరుకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ–పాస్ మిషన్‌లలో కార్డుదారుల వేలి ముద్రలు పడక నిత్యావసర సరుకులు పొందడంలో ఇబ్బందులు పడుతున్న వారి కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ పరిష్కార చర్యలు తీసుకున్నట్లు డీఎస్‌ఓ సుబ్రమణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా 6వ తేదీన ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు గ్రామ రెవెన్యూ అధికారులు చౌక ధరల దుకాణం వద్ద అందుబాటులో ఉండి ఇందుకు సహరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ శనివారం నుంచి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలిముద్రలు పడనివారికి వీఆర్‌ఓలు వారి వేలి ముద్రలను ఈ–పాస్ మిషన్‌లో వేసి.. సరుకులు డ్రా చేసి కార్డుదారులకు పంపిణీ చేస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

- అట్టహాసంగా ముప్పత్తు మువ్వర పాసురామ్ పూజలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గోదాదేవి



శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ప్రహ్లాదవరదస్వామి, ఆండాల్ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అహోబిలం(ఆళ్లగడ్డ): అహోబిల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మూలవిరాట్‌లైన శ్రీప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో పాటు ఆండాల్ అమ్మవారికి వేకువజామునే ప్రాతఃకాల ప్రత్యేక ధనుర్మాస పూజలు చేశారు. ఉత్సవమూర్తి గోదా దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఆండాల్ సన్నిధిలో కొలువుంచి అర్చన, అభిషేకం నిర్వహించారు. ప్రాతఃకాల పూజల్లో భాగంగా ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని మండపంలో కొలువుంచి ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముప్పత్తు మువక్ర పాశురం పూజలు చేశారు. అలాగే సాయంత్రం ప్రత్యేకంగా నూతన పట్టువస్త్రాలతో అలంకరించి.. పూల పల్లకీలో కొలువుంచి ఆండాల్ అమ్మవారి సారథ్యంలో మాడ వీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి లేయార్ప శాతుమరై పూజలతో కార్యక్రమాన్ని ముగించి.. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలు ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణన్ ఆధ్వర్యంలో జరిగాయి.

మాటేసిన మహమ్మారి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతి వెయ్యి మంది జనాభాలో 40- 50 మందికి హెపటైటిస్–సీ నిర్ధారణ అవుతోంది. గత ఏడాది కొంకల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో వెయ్యి మందిని పరీక్షించగా.. అందులో 300 మందికి ఈ వ్యాధి ఉన్నట్లు తేలింది. కర్నూలు జిల్లాలోనూ డోన్, ప్యాపిలి మధ్య ఉన్న గ్రామాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అధికంగా ఇది 25 ఏళ్లు పైబడ్డ వారిలోనే కనిపిస్తోందని వారు పేర్కొంటున్నారు.

ఆందోళన చెందుతున్న వైద్యులు

హెపటైటిస్–సీతో రోగి వచ్చాడంటే వైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. వారికి చికిత్స చేసే సమయంలో రక్తం పొరపాటున తమలోకి వెళ్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళనకు గురవుతున్నారు. ఈ కారణంగానే హెపటైటిస్–సీ ఉన్న వారికి నగరంలోని పలు నర్సింగ్‌హోమ్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ ఆపరేషన్లు చేయడం లేదని తెలుస్తోంది. కర్నూలు సర్వజన వైద్యశాలలోనూ అన్ని ఆపరేషన్లు పూర్తయిన తర్వాత చివరగా హెపటైటిస్–సీ ఉన్న వారికి నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత ఆపరేషన్ థియేటర్‌ను స్టెరిలైజ్ చేయిస్తున్నారు. అదే ప్రైవేటు ఆసుపత్రిలో అయితే ఇలా ఆపరేషన్ థియేటర్‌ను స్టెరిలైజ్ చేయడానికి ప్రత్యేక చార్జీ వసూలు చేస్తున్నారు.

కారణాలు ఇవీ..

గతంలో ఎవరికైనా ఇంజెక్షన్ వేయాలంటే డిస్పోజబుల్ సిరంజి వాడేవారు కాదు. ఒకరికి వేసిన సిరంజినే మళ్లీ మళ్లీ వినియోగించేవారు. ఈ క్రమంలో ఒకరి రక్తం మరొకరి శరీరంలోకి వెళ్లి పలు రకాల వ్యాధులకు కారణమయ్యేది. హెచ్‌ఐవీ, హెపటైటిస్ వంటి వ్యాధులు సైతం ఈ విధంగానే ఒకరి నుంచి మరొకరికి సోకాయి. హెపటైటిస్–సీ వ్యాధి కారక వైరస్ అప్పట్లోనే ఒకరి నుంచి మరొకరికి సోకినా అది బయట పడేందుకు 20 నుంచి 30 ఏళ్లు పడుతుందని వైద్యులు చెబుతున్నారు. అప్పట్లో ఆర్‌ఎంపీలు అధికంగా ఒకే సిరంజిలను ఆయా గ్రామాల్లో వాడటం వల్లే ఈ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లు వారు విశ్లేషిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

పచ్చకామెర్లుగా ఈ వ్యాధి బయటపడుతుంది. దీంతో పాటు కాళ్లవాపులు, కడుపువాపు, రక్తపు వాంతులు ఉంటాయి. ఇది క్రమేణా లివర్ సిర్రోసిస్(కాలేయ వాపు)నకు, కాలేయ క్యాన్సర్‌కు దారి తీస్తుంది. ఆయా గ్రామాల నుంచి ఇతర వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే వారికి చేస్తున్న వైద్యపరీక్షల్లో 15 నుంచి 20 శాతం మందికి నయం కాని హెపటైటిస్–సీ ఉన్నట్లు తెలుతోంది. అంటే వీరు పూర్తిగా లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌తో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

త్వరగా వ్యాధిని గుర్తిస్తే మేలు

హెపటైటిస్–బీ వ్యాధికి జీవితాంతం మందులు వాడాల్సి వస్తుంది. కానీ హెపటైటిస్–సీకి ఇప్పుడు ఆధునిక మందులు వచ్చాయి. సోఫసఫోవివర్, వెల్‌పటసవిర్ మందులు కలిపి 12 వారాలు (రూ.40 వేలు ఖర్చు) వాడితే సరిపోతుంది. వ్యాధిని గుర్తించేందుకు ముందుగా ర్యాపిడ్ మెథడ్‌లో హెచ్‌సీవీ టెస్ట్ చేస్తారు. ఇందులో వ్యాధి నిర్ధారణ అయితే రూ.15 వేలు విలువ చేసే ఆర్‌ఎన్‌ఏ జెనో టైప్ పరీక్షను ఉచితంగా మేమే చేయిస్తున్నాం. ప్రాథమిక దశలో వస్తేనే ఈ వ్యాధికి చికిత్స సులభమవుతుంది.

–డాక్టర్ మోహన్‌రెడ్డి,
గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

పందెం కోళ్లు!






▶ మొదటి పేజీ తరువాయి

అయ్యింది. ప్రధానంగా కర్నూలు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో బరిలో ఉండేది 'నేనే అంటే నేనే' అంటూ పోటీపడుతున్నారు. కర్నూలు నియోజకవర్గంలో సర్వే ఆధారంగా తనకే సీటు వస్తుందని టీజీ భరత్ ప్రకటిస్తుండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యే హోదాలో తానే పోటీ చేయనున్నట్టు ఎస్వీ మోహన్‌రెడ్డి చెబుతున్నారు. ప్రతి జన్మభూమి సభలోనూ వచ్చే సాధారణ ఎన్నికల్లో తానే పోటీ చేయనున్నట్టు ఎస్వీ ప్రకటిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. మరోవైపు సర్వే ఆధారంగా గెలుపు అభ్యర్థిని తానేనని, అందువల్ల తనకే సీటు వస్తుందని టీజీ భరత్ ఒక అడుగు ముందుకేసి చెబుతున్నారు. ఓడిపోయే అభ్యర్థికి సీటు ఇవ్వరంటూ పరోక్షంగా ఎస్వీ మోహన్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనూ సీట్ల పోరు కొత్త సంవత్సరం వేడుక సాక్షిగా మొదలయ్యింది. ఇక్కడ టీడీపీ తరపున బరిలో నిలిచేది తానేనని భూమా నాగిరెడ్డి సన్నిహిత మిత్రుడు ఏవీ సుబ్బారెడ్డి తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తుండటం కలకలం రేపుతోంది. అంతేకాకుండా బలనిరూపణకు వేదికగా ఆయన నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మంత్రి అఖిలప్రియ వద్దన్నప్పటికీ బలమేమిటో నిరూపించుకోగలగడం ద్వారా తానే పందెం కోడినని ఏవీ సుబ్బారెడ్డి స్పష్టం చేస్తున్నారు.

నేనంటే నేనే..!

కర్నూలు నియోజకవర్గంలో ఎవరికి ఓటు వేస్తారంటూ ఓటర్లందరి ఫోన్లకు వాయిస్ మెసేజ్ పంపి సర్వే చేపట్టారు. ఇందులోనే ఎవరు మీ అభ్యర్థి అంటూ మొదటి నెంబరు టీజీ భరత్‌కు, రెండో నెంబరు ఎస్వీ మోహన్ రెడ్డికి కేటాయించడంతో అసలు పోరు మొదలయ్యింది. ఈ సర్వేతోనే సీటు గొడవ మొదలయ్యింది. గెలిచే అభ్యర్థి తానేనని, అందువల్ల సీటు తనకేనని టీజీ భరత్ స్పష్టం చేస్తున్నారు. అయితే, గత మూడు రోజులుగా ప్రతి జన్మభూమి సభలోనూ తానే కర్నూలు నుంచి పోటీ చేస్తానని, కొందరు కావాలని పత్తికొండ నుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం చేస్తున్నారని ఎస్వీ మోహన్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ఇక ఆళ్లగడ్డలోనూ తాజాగా పోరు మొదలయ్యింది. నూతన సంవత్సర వేడుకల సాక్షిగా భూమా అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి మధ్య సీట్ల గొడవ ప్రారంభమైంది. తనకే అధిక బలం ఉందని నిరూపణ కోసం ఏవీ ప్రయత్నించారు. భూమా బంధువులు కూడా తన వెంటే నడుస్తారని చెప్పుకోవడంలో ఆయన సఫలీకృతుడయ్యారు. మరోవైపు తన వర్గాన్ని కాపాడుకునే పనిలో మంత్రి అఖిలప్రియ నిమగ్నమయ్యారు. ఏవీ పార్టీకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసే పని చేశారు. మంత్రిగా, తన తండ్రి వారసురాలిగా తనకే సీటు అని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సర్వే గుబులు!

ఇక అధికార పార్టీ నేతల్లో సర్వే గుబులు ప్రారంభమయ్యింది. మొదట్లో కేవలం కర్నూలు నియోజకవర్గంలోనే అభ్యర్థిపై సర్వే జరగగా... తాజాగా అన్ని నియోజకవర్గాల్లోని ఓటర్లకు ఫోన్లు వస్తుండటం గమనార్హం. పోటీలో ఎవరు నిలబడితే గెలుస్తారో చెప్పాలంటూ ఐవీఆర్‌ఎస్ ద్వారా ఆయా నియోజకవర్గ ఓటర్లకు ఫోన్లు వస్తున్నాయి. ఈ సర్వే ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేస్తారనే గుబులు అందరిలోనూ మొదలయ్యింది. సర్వే ఆధారంగా ఇస్తే తమ భవితవ్యం ఏమిటని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తమ్మీద అధికార పార్టీలో సంక్రాంతి సాక్షిగా ఎన్నికల పందెం కోళ్ల పోటీ ప్రారంభమయ్యిందన్నమాట!

ఇదేంది తమ్ముడూ?

- వెల్దుర్తిలో ఇసుక మాఫియా గొడవలు
- ట్రక్కుల్లో ఇసుక... సంచుల్లో డబ్బులు
- అక్రమ రవాణాలో తెలుగు తమ్ముళ్ల ప్రమేయం
- ఆధిపత్యం కోసం తన్నులాట

కర్నూలు (వైఎస్ఆర్‌సర్కిల్):

అధికార పార్టీ నేతలకు ఇసుక వ్యాపారం కాసులు కురిపిస్తోంది. వంకలు..వాగులు తేడా లేకుండా ఇసుక కన్పిస్తే చాలు అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలన్నీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో.. అధికారుల అండదండలతో అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతున్నాయి. మొక్కుబడి దాడులతో.. నామమాత్రపు జరిమానాలతో సరిపెట్టే అధికార యంత్రాంగం వీరికి పరోక్షంగా సహకరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ధనదాహానికి అలవాటు పడిన తెలుగు తమ్ముళ్లు ఇసుక మాఫియాపై ఆధిపత్యం కోసం పరస్పరం దాడులకు తెగబడుతున్నారు. వెల్దుర్తి మండలంలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త, ఓ మాజీ ఎంపీపీ మధ్య తలెత్తిన విభేదాలు మాఫియా గొడవలను తలపిస్తుండడం ఇందుకు నిదర్శనం. ఇదే తరహా ఘటనలు సమీప మండలాల్లోనూ చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



బొమ్మిరెడ్డి పల్లె వద్ద ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

రాత్రీ పగలు తరలింపు..

వెల్దుర్తి, డోన్, క్రిష్ణగిరి, కోడుమూరు, వర్కూరు తదితర ప్రాంతాల సమీప వంకల నుంచి వెయ్యి ట్రాక్టర్లకుపైగా ఇసుక తరలింపులో నిమగ్నమయ్యాయి. వంకల నుంచి సేకరించిన ఇసుకను మండల కేంద్రాలు, గ్రామ శివార్లలో డంప్ చేసి అనుకూల సమయంలో ట్రిప్పు రూ.2,500 నుంచి రూ.3,500 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగంలో ఇసుకాసురుల ఆదాయం నెలకు రూ. 15 కోట్లకుపైగా ఉంటున్నట్లు సమాచారం. విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించి పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎత్తుకు పైఎత్తులు....!

ఇసుక అక్రమ రవాణాపై అధికారులు దాడులు చేసినా ఇసుక మాఫియా బెదరడంలేదు. గత ఏడాది డిసెంబర్‌లో వెల్దుర్తి సమీపంలోని ఎల్లమ్మగుడి రస్తా వద్ద ఓ మాజీ ఎంపీపీ వర్గానికి చెందిన 10 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను తహసీల్దార్ రామాంజనేయులునాయక్, ఎస్ఐ ఖాజావలీ సీజ్‌చేశారు. దీంతో రెచ్చిపోయిన ఆవతలి వర్గం నాయకులు మరుసటి రోజే నార్లాపురం-బొమ్మిరెడ్డి పల్లె గ్రామాల వద్ద ప్రత్యర్థి ఎంపీపీకి చెందిన 100 ట్రాక్టర్ల ఇసుక డంప్‌పై సమాచారం అందించి అధికారులతో సీజ్ చేయించారు.

వంకలకూ వసూళ్లు..

వెల్దుర్తి, సమీప ప్రాంతాల్లో కొందరు నాయకులు గ్రామ శివారులోని వంకలను కూడా కొల్లగొడుతున్నారు. ఎవరైనా ఇసుక కావాల్సి వస్తే రూ.200 చెల్లిస్తేనే ట్రాక్టర్‌ను అనుమతిస్తూ దందాకు తెరతీశారు. బయటి వ్యక్తులకు రూ.200 వసూలు చేస్తున్న వీరు.. తమ సొంత ట్రాక్టర్లతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తూ కోట్లాది రూపాయలతో జేబులు నింపుకొంటున్నారు. అప్పనంగా వస్తున్న సంపాదన చూసి తమ్ముళ్లు తమదంటే తమదని తన్నుకుంటున్నారు. మాఫియాగా ఏర్పడి పెత్తనం కోసం పోటీ పడుతున్నారు. ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడటం, హత్యలు చేయించడం పరిపాటిగా మారినా అధికారుల తీరులో మార్పు రాకపోవడం గమనార్హం.

వాగులు, వంకలు మటుమాయం..

వెల్దుర్తి, కోడుమూరు, సి. బెళగల్ తదితర మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలే లక్ష్యంగా తెలుగు తమ్ముళ్లు బరిలోకి దిగుతున్నారు. నదీగర్భాలు, వంకల్లో లోతట్టు నేల కన్పించేలా ఇసుక తోడేస్తున్నారు. వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె-నార్లాపురం మధ్య వంకలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వ లుండటం తెలుసుకున్న అధికార పార్టీ నాయకులు 5 నెలల పాటు తవ్వి అక్రమంగా తరలించేశారు.

మహానేత చలువ..
సిద్ధాపురానికి మహర్దశ

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలో వేలాది ఎకరాల మెట్టభూములు ఉన్నాయి. వర్షం పడితేనే పంటలు పండుతాయి. లేదంటే బీడుగా పెట్టాల్సిందే. వరుణుడి కరుణ కరువై రైతులు తరచూ పంటలు నష్టపోతుంటారు. 30 ఏళ్లుగా ఇదే పరిస్థితి. దీన్ని కళ్లారా చూసిన మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 'జలయజ్ఞం'లో భాగంగా ఈ ప్రాంతానికి అపూర్వ కానుక ఇచ్చారు. అదే సిద్ధాపురం ఎత్తిపోతల పథకం. 2006 ఏప్రిల్ 30న మండు వేసవిలో వేలాది మంది రైతన్నల హర్షధ్వానాల మధ్య సరిగ్గా మధ్యాహ్నం 12.40 గంటలకు ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. అక్కడికక్కడే రూ.75 కోట్లు విడుదల చేశారు. ఈ పథకాన్నే కాదు.. లింగాల, చెలిమిళ్ల, ఇస్కాల, మంచాలకట్ట, పాతమాడుగుల, శివపురం, కొక్కెరంచ, గుంతకందాల పథకాలనూ మంజూరు చేశారు. వీటికి కూడా రూ.110 కోట్లు ఇచ్చారు. కాగా.. మహానేత మరణం తర్వాత సిద్ధాపురం పనులు ఆగిపోయాయి. 2006లో శంకుస్థాపన జరిగిన ఈ పథకం నేటి వరకు పూర్తి కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొందరు ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పర్సెంటేజీలు దండుకునేందుకు ప్రయత్నించడంతో పనులు నత్తనడకన సాగాయి. ఒకానొక దశలో కాంట్రాక్టర్లు తాము చేయలేమంటూ చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో పనుల అంచనా వ్యయం కూడా రూ.75 కోట్ల నుంచి రూ.113 కోట్లకు పెరిగింది. అదనపు నిధులు కేటాయిస్తే తప్ప పనులు ముందుకు సాగలేదు.

ఉద్దేశం ఇదీ..

13 గ్రామాలకు చెందిన 23 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో వైఎస్సార్ ఈ పథకానికి భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా వెలుగోడు ప్రాజెక్ట్ నుంచి సిద్ధాపురం చెరువుకు నీటిని పంపింగ్ చేస్తారు. చెరువు సామర్థ్యాన్ని బట్టి 0.65 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. వెలుగోడు రిజర్వాయర్‌లో ఏడు టీఎంసీల కంటే ఎక్కువ నీరు ఉంటేనే సిద్ధాపురం చెరువుకు అందుతుంది. ఈ నీటిని కూడా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు మాత్రమే తీసుకునే వీలుంది.

చంద్రబాబు ప్రారంభించినా...

సీఎం చంద్రబాబు ఈ నెల ఏడున సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నారు. లిఫ్ట్ ద్వారా నీరు ఎత్తిపోసినా ఈ ఏడాది మాత్రం పంట పొలాలకు ఉపయోగపడదు. ఇప్పటికే రబీ సీజన్ మొదలై మూడు నెలలు అవుతోంది. ఒకవేళ రైతులు ఇప్పుడు పంట వేసినా జూన్‌లో కోతకు వచ్చే అవకాశం ఉంది. కావున నీటికొరత తలెత్తి పంటలు నష్టపోతారు. ఇకపోతే పంట కాలువలు కూడా ఏర్పాటు చేయలేదు. చెరువు సమీపంలో ఉన్న గ్రామాలతో పాటు ఆత్మకూరు పట్టణ సమీపంలోని కరివేన లాంటి గ్రామాలకు నీరు అందాలంటే పంట కాలువలు అత్యంత ముఖ్యం. ఇవి మరో మూడేళ్లకు గానీ పూర్తయ్యే అవకాశం లేదు.

బాధిత కుటుంబాలకు భరోసా ఏదీ?

- జిల్లాలో 170 మంది రైతుల ఆత్మహత్య
- 19 కుటుంబాలకే ఆర్థిక సాయం
- రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడి వెల్లడి
- 9 మంది రైతులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యకు పాల్పడుతుంటే.. బాధిత కుటుంబాలకు కనీస పరిహారం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కడింపల్లి మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,598 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడితే 292 కుటుంబాలకు మాత్రం పరిహారం అందిందన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన వివిధ మండలాలకు చెందిన 9 మంది రైతులకు శుక్రవారం వీఆర్‌డీఎస్, ఎయిడ్ ఇండియా సహకారంతో రైతు స్వరాజ్య వేదిక రూ.10వేల ప్రకారం ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆత్మహత్యల్లో అనంతపురం, కర్నూలు జిల్లాలు రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉండడం ఆందోళనకరమన్నారు. కర్నూలు జిల్లాలో 170 మంది బలవన్మరణాలకు పాల్పడితే 19 మందికి మాత్రమే పరిహారం అందించారన్నారు. కౌలు రైతులకు ప్రత్యేక చట్టం తెచ్చినా ఉపయోగం లేదన్నారు. బాధిత కుటుంబాలకు జీఓ నెంబరు 421, 62 ప్రకారం రూ.5లక్షల పరిహారం అందించాలని కోరారు. అమెరిక నుంచి వచ్చిన ఐఫర్ పార్మర్ ప్రతినిధి రణబోతు శ్రీనివాస్.. జిల్లాలో రైతు ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులు తెలుసుకున్నారు. వీఆర్‌డీఎస్ అధ్యక్షుడు కొమ్మూరి విజయకుమార్, జిల్లా బీసీ సంఘం నేత శేషఫణి, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు నవీన్ రామిశెట్టి, పోతుల శేఖర్, మోహనకృష్ణ, స్వప్న, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా బాధ్యతలు నిర్వర్తించండి

- సీఎం పర్యటనపై కలెక్టర్ సత్యనారాయణ
- జిల్లా అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ

కర్నూలు(అగ్రికల్చర్): సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గం సిద్ధాపురం ప్రాజెక్టు వద్ద సీఎం.. జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జలహారతి సందర్భంగా సర్వమత ప్రార్థనలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముగ్గులు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, హరిదాసు కథలు, గంగిరెద్దుల ఆటలు, కోలాటాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. నీటిపారుదల శాఖ, డ్వామా, ఏపీఎంపీ, అటవీ తదితర శాఖల అధికారులు ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు.సమావేశంలో జేసీ ప్రసన్న వెంకటేష్, డీఆర్‌ఓ శేషిరేవి, ఇరిగేషన్ ఎస్ఈ నారాయణరెడ్డి, జెడ్పీ సీఈఓ ఈశ్వర్, సీపీఓ ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ గోపినాథ్‌జట్టి

కర్నూలు: ఈ నెల 7న సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో బందోబస్తుపై ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గోపీనాథ్‌జట్టి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. ఆత్మకూరు మండలం సిద్ధాపురంలో సీఎం.. బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బందోబస్తు పర్యవేక్షణ బాధ్యతను అదనపు ఎస్పీ షేక్షావలి, ఐ. వెంకటేష్, ఓఎస్డీ రవిప్రకాష్‌కు అప్పగించారు. బందోబస్తుకు 12 మంది డీఎస్పీలు, 31 మంది సీఐలు, 89 మంది ఎస్ఐలు, 144 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 500 మంది కానిస్టేబుళ్లు, 65 మంది మహిళా కానిస్టేబుళ్, 260 మంది హోంగార్డులు, 6 స్పెషల్‌పార్టీ బలగాలు, 6ప్లటూన్ల ఏఆర్ సిబ్బంది కేటాయించారు. డీఎస్పీలు ఖాదర్‌బాషా, వినోద్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు.

భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.

మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.



కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు

ఉజ్జయినిలో శ్రీశైలం స్టాల్

శ్రీశైలం: శివఉత్సవ్‌లో భాగంగా ఉజ్జయినిలో శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన స్టాల్ భక్తులను ఆకట్టుకుంటోంది. ఉజ్జయిని మహాక్షేత్ర సంస్థాన్ వారు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జ్యోతిర్లింగాల దేవస్థానాల వారిని శివ ఉత్సవ్ పేరిట స్టాల్స్‌ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. శుక్రవారం ప్రారంభమైన శివ ఉత్సవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివాజీ సింగ్ చౌహాన్ శ్రీశైలదేవస్థానం ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఉభయదేవాలయాల ప్రధాన అర్చకులు, అధికారులు.. సీఎమ్‌కు స్వామి,అమ్మవార్ల ప్రసాదం, శేష వస్త్రాలు, దేవస్థానం క్యాలెండర్, డైరీలను అందజేశారు. శివమహోత్సవాల్లో భాగంగా.. భారత తపాలా శాఖ ఇండోర్ రీజియన్ మధ్యప్రదేశ్ వారు శ్రీశైలాలయ ప్రాంగణం, శ్రీ భ్రమరాంబాసమేత మల్లికార్జునస్వామి వార్ల జ్యోతిర్లింగ ఛాయచిత్రాలతో కూడిన పోస్ట్‌కార్డును శుక్రవారం విడుదల చేశారు.



ఉజ్జయినిలో ఏర్పాటు చేసిన స్టాల్

హొళగుందలో అఘోరాలు!



హొళగుంద: మండల కేంద్రమైన హొళగుందలో శుక్రవారం అఘోరాలు కనిపించారు. స్థానిక సాయిబాబా మందిరం సమీపంలో జీపులోంచి దిగంబరంగా ఇద్దరు అఘోరాలు దిగడంతో స్థానికులు లుంగీలు ఇచ్చారు. వీరిలో ఒకరు.. సాయిబాబా ఆలయంలోకి వెళ్లి కొద్దిసేపు పూజలు చేశాడు. కొద్దిసేపు హడావుడి చేసి వీరు వెళ్లిపోయారు.

1,735 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల ఏర్పాటు

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): జిల్లాలో 2014–2017 మధ్య కాలంలో 1,735 ఎంఎస్‌ఎంఈ(మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజేస్) పరిశ్రమలను ఏర్పాటు చేసినట్లు పరిశ్రమల శాఖ ఒక ప్రకటనను విడుదల చేసింది. వీటి నిర్మాణ కోసం రూ.477 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు అందులో పేర్కొంది. 2014–15 ఆర్థిక సంవత్సరంలో 119 పరిశ్రమలకుగాను రూ.77.49 కోట్లు, 2015–16లో 204 పరిశ్రమలకుగాను రూ.76.34 కోట్లు, 2016–17లో 992 పరిశ్రమలకుగాను రూ.213.11 కోట్లు, 2017–18లో 420 పరిశ్రమలకుగాను 109.70 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు.

నేటి నుంచి మండల శివదీక్ష

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభం కానున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నుంచి మండల శివదీక్షను స్వీకరించవచ్చునని ఆలయ అధికారులు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా అక్కమహాదేవి అలంకార మండపంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులు నియమానుసారంగా దీక్షను ఆచరించి బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి రోజుల విరమణ చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు.

చెన్నైలో హిందూ ధర్మ ప్రచారం:
శ్రీశైలం నుంచి చెన్నై నగరానికి ప్రచార రథం శుక్రారం బయలుదేరి వెళ్ళింది. ఈ సందర్భంగా గంగాధర మండపం వద్ద ధర్మప్రచార రథంలోని దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. చెన్నై నగరంలోని శ్రీ కుచలాంబాళ్ కల్యాణ మండపంలో ఈ నెల 7న శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు –	ఖాళీ లేవు
రూ.50 గదులు –	ఖాళీ లేవు
రూ.100 గదులు –	ఖాళీ లేవు
రూ.500 గదులు –	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ –	ఖాళీ లేవు
వసంతోత్సవం –	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం –	ఖాళీ లేవు



మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సస్పెన్షన్

– కందుల కొనుగోలులో అక్రమాల ఫలితం

కర్నూలు(అగ్రికల్చర్): మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పరిమళ జ్యోతిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మద్దతు ధరతో 2016లో కందుల కొనుగోలు చేయగా.. భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. వ్యాపారులు మద్దతు ధరకు అమ్ముకొని లబ్ధిపొందినట్లు ఫిర్యాదు రావడం.. ఇందుకు జిల్లా మేనేజర్ కారణమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ స్థానంలో నంద్యాల దాణ మిక్సింగ్ యూనిట్ మేనేజర్ నాగరాజుకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

శిశువుల భద్రత కోసమే 'ఊయల'

కర్నూలు (టౌన్): శిశువుల భద్రత కోసమే ఊయల కార్యక్రమం ప్రారంభించినట్లు జేసీ–2 రామస్వామి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలోని మాత, శిశు విభాగంలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కొంత మంది తల్లులు పేదరికం.. ఇతర అనేక కారణాలతో శిశువులను వదిలేస్తున్నారని.. అలా చేయకుండా చిల్డ్రన్స్ వార్డులో ఏర్పాటు చేసిన ఊయలలో అప్పగించవచ్చన్నారు. తల్లులు వదిలేసిన శిశువులను క్షేమంగా శిశువిహార్‌లో సంరక్షించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మార్చి 8న శ్రీశైలంలో కుంభాభిషేకం

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 8న కుంభాభిషేకం నిర్వహించాలని దేవస్థాన సంకల్పించింది. సంక్రాంతి తరువాత ఉత్తరాయణ పుణ్య కాలం ప్రారంభం కావడం, శివాజీ గోపుర పునఃనిర్మాణం పూర్తవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు దేవస్థానం ఈఓ భరత్‌గుప్త నిర్ధారణ కమిటీ తీర్మానానికి ఫైల్‌ను శుక్రవారం సిద్ధం చేశారు. ఈ నెల 15న రాష్ట్ర దేవాదాయ ప్రిన్సిపల్ కార్యదర్శి, కమిషనర్, కలెక్టర్, ఈఓల ఆధ్వర్యంలో నిర్ధారణ కమిటీ విజయవాడలో సమావేశం కానున్నది. మహారుద్ర శతచండీ స్వాహాకార పూర్వక కుంభాభిషేకాన్ని నిర్వహించడానికి శృంగేరి జగద్గురు శ్రీభారతి తీర్థ మహాస్వామి , శ్రీజగద్గురు శంకరాచార్య మహాసంస్థాన్, శృంగేరి వారి అభిప్రాయాలను తెలుసుకోనుంది.

అప్‌గ్రేడ్ అయిన ఉర్దూ స్కూళ్లు ప్రారంభం

కర్నూలు సిటీ: జిల్లాలో 58 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 33 అప్‌గ్రేడ్ అయిన స్కూళ్లలో 6,7,8 తరగతులను ప్రారంభించారు. నగరంలోని గడ్డావీధిలోని 29వ పేట ఉర్దూ స్కూల్‌ను ఏపీ ఉర్దూ టీచర్ల సంఘం జనరల్ సెక్రటరీ దాదాపీర్ ప్రారంభించారు. అనంతరం ఆ స్కూల్‌లో 6,7,8 తరగతులకు చెందిన వారికి ఆడ్మిషన్లు కూడా ఇచ్చారు.

చెన్నంపల్లి కోటలో ఆగని వేట


కోట బురుజులో రాళ్లు తొలగిస్తున్న కూలీలు

చెన్నంపల్లి(తుగ్గలి) : గుప్త నిధుల కోసం ప్రభుత్వం చెన్నంపల్లి కోటలో చేస్తున్న తవ్వకాలు ఆగడం లేదు. 24 రోజులుగా కోటలో ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. వారం రోజులుగా దిశ మార్చి కోట బురుజులోని రాళ్లు, మట్టిని తొలగిస్తున్నారు. ప్రారంభంలో పది రోజుల పాటు గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగినా ప్రస్తుతం వారు లేకుండానే పనులు యథావిధిగా సాగుతున్నాయి. కోటలో సర్వే చేసేందుకు వస్తాయని చెప్పిన అత్యాధునిక పరికరాలు ఇంత వరకు రాలేదు. రోజురోజుకు ఆలస్యం జరుగుతోంది. ఏదేమైనా కోటలో నిధి బయటపడే వరకు ప్రభుత్వం తవ్వకాలను విరమించేలా లేదు. శుక్రవారం ఆర్డీఓ ఓబులేసు, తహసీల్దార్ గోపాలరావు, వీఆర్‌ఓ కాశీరంగస్వామి పనులను పర్యవేక్షించారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో పంజాబ్ నుంచి పశ్చిమబెంగాల్ మధ్య ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. కేరళలో చెదురుమదురు వాన పడే అవకాశం ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో చల్లని ఈదురు గాలు వీసే అవకాశం ఉంది.

గుంటూరు / కర్నూలు వాతావరణం

గరిష్టం కనిష్టం

30.0°/16.2° / 31.2°/18.1°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.1	07.2
కోల్‌కతా	22.3	11.1
బెంగళూరు	27.2	15.5
ముంబై	29.6	16.8
చెన్నై	29.5	20.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
ఒంగోలు	31.3/20.1	తిరుపతి	29.9/14.2
కర్నూలు	31.2/18.1	విజయవాడ	29.7/17.0
మహబూబ్‌నగర్	31.2/16.6	ఏలూరు	29.6/19.0
కడప	31.1/15.5	రాజమండ్రి	29.6/19.0
ఖమ్మం	31.0/10.4	తాడేపల్లిగూడెం	29.6/19.0
ఆదిలాబాద్	31.0/06.0	నల్లగొండ	29.6/15.2
అనంతపురం	30.7/16.2	కరీంనగర్	29.6/10.7
నెల్లూరు	30.6/20.8	హైదరాబాద్	29.4/13.3
నిజామాబాద్	30.5/15.5	రంగారెడ్డి	29.4/13.3
మెదక్	30.5/11.0	కాకినాడ	29.0/18.4
వరంగల్	30.2/14.0	విశాఖపట్నం	28.2/19.2
గుంటూరు	30.0/16.2	శ్రీకాకుళం	27.7/15.5
చిత్తూరు	29.9/14.2	విజయనగరం	27.7/15.5

బుల్లితెర


W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	గుడ్ మార్నింగ్
ఉ.07.30	కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.08.00	న్యూస్ ఫీచర్
ఉ.08.30	రీజనల్ న్యూస్
ఉ.09.30	మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30	న్యూస్ ఫీచర్
ఉ.11.30	పొలిటికల్ కారిడార్
మ.12.00	మూవీ మ్యాటర్స్
సా.04.30	మార్గం
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	ఉర్దూ న్యూస్
సా.06.00	రీజనల్ న్యూస్
రా.08.00	సాక్షి న్యూస్
రా.08.30	బతుకు చిత్రం
రా.09.00	న్యూస్ 360
రా.09.30	జ్యాక్ బాక్స్
రా.10.30	మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం




మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2



హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మథుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఘీ
రా.11.44 ఖేల్ పవర్ కా

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : కర్నూలు టౌన్ - 99511 49182, రాజ్‌విహార్ - 97053 46981, అగ్రికల్చర్ -97053 46986, హాస్పిటల్-97053 46983, కొండారెడ్డి ఫోర్టు-9505880148, లీగల్ - 94408 75411, కల్చరల్ - 98493 67922, అర్బన్ - 99667 33904, ఓల్డ్‌సిటీ - 94927 86803, న్యూసిటీ - 94407 10153, సిటీ - 99514 04424, సీ క్యాంప్ - 81214 41029, కర్నూలు - 97053 48056, కర్నూలు(ఆర్‌యూ) - 98855 90542, కర్నూలు(వైఎస్‌ఆర్‌సర్కిల్) - 88011 83099



'వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు'



ధర్నా చేస్తున్న గిరిజన సమాఖ్య నాయకులు

కర్నూలు(న్యూసిటీ): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.గోవిందు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ దగ్గర ఉన్న మహాత్మగాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో చేర్చుతామని సీఎం చంద్రబాబు కులాల మధ్య చిచ్చు పెట్టారని ఆరోపించారు. ధర్నాలో దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు జి.మహేంద్ర, గిరిజన సమాఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గరికపాటి రవి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జయరామనాయక్, రాముడు, రామ్‌నాయక్, శోభన్‌బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, కార్మికులు

కల్లూరు (రూరల్): ఎంవీ యాక్ట్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని శుక్రవారం కర్నూలు1, 2 డిపోలఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్‌టీసీ స్టాఫ్, వర్క్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రీజనల్ సెక్రటరీ సంజీవరాయుడు మాట్లాడుతూ ఎంవీ యాక్ట్ సవరణ బిల్లు రాజ్యసభలో ఆమోదిస్తే ఆర్టీసీ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఆపరేటర్లకు సహకరించే చట్ట సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ట్రెజరర్ ఎస్.ఆర్.కె.రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో డిపో సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ హనుమంతరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

రవీంద్ర డిగ్రీ కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్



ఉద్యోగాలకు ఎంపికైనవారితో జి.వి.ఎం. మోహన్‌కుమార్

కర్నూలు సిటీ: స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర మహిళ డిగ్రీ కాళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. ప్రిన్సిపాల్ జి.మమత మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ఐఎల్‌ఎం ట్రైనర్స్ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 31 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వారికి ఏడాదికి రూ.2.16 లక్షల వేతనం ఇస్తారని చెప్పారు. ఎంపికైన వారిని విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, కాలేజీ వైస్ చైర్మెన్ జ్యోతి, కో-ఆర్డినేటర్ జి.శశికుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఈ- ఆఫీస్‌పై అవగాహన పెంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు (టౌన్): ప్రతి ఉద్యోగి ఈ-ఆఫీస్ పాలనపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో తన చాంబర్‌లో మినిస్టిరీయల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వం అన్ని శాఖల్లో పేపర్‌లెస్ పాలనను అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని, ఇకనుంచి ప్రతి ఫైల్‌ను కంప్యూటీకరించాల్సి ఉంటుందని చెప్పారు.సిబ్బందికి ప్రతిరోజు నలుగురి చొప్పున కలెక్టరేట్‌లో నీ-ఆఫీసుపై శిక్షణ ఇస్తారన్నారు. అలాగే త్వరలోనే మినిస్టీరియల్ సిబ్బందికి అంతర్గత బదిలీలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ తరువాత ఆసుపత్రిలో ఒకే చోట దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానభ్రంశం కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ ఎంఒ శ్రీరాములు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరా?

- ఎమ్మెల్యే ఎస్వీని నిలదీసిన సీపీఎం నాయకులు



ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని నిలదీస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): నగరంలోని 10,11 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మునిసిపల్ అధికారులను జన్మభూమి సభలో నిలదీశారు. శుక్రవారం ఆయా వార్డుల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా సీపీఎం నాయకులు అబ్దుల్‌దేశాయ్, ఇక్బాల్, హుసేన్, ఇంతియాజ్ పలు సమస్యలపై అధికారులు స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో వార్డు పరిధిలోని చాకలి వీధిలో మంచినీటి పైపులైన్ పగిలి కలుషితం అవుతోందని మార్చాలని కాలనీవాసులు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. వీధి దీపాలు వెలగడంలేదని పలుమార్లు అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడంలేదన్నారు. 16వ వార్డు పరిధిలోని కడ్పురంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

కుస్తీ క్రీడాకారుల ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్) : నగరంలోని స్పోర్ట్సు అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా స్థాయి కుస్తీ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ ఎంపిక పోటీలను లాంచనంగా ప్రారంభించారు. పోటీల్లో జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొనగా 30 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కుస్తీ అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి కాటేపోగు మల్లికార్జున తెలిపారు. వీరు ఈనెల 10 నుంచి 12 వరకు ఒంగోలు, 20 నుంచి 22 వరకు కడప జిల్లాలో 4వ రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ కుస్తీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు కోచ్ అంజనేయులు రెఫరీగా వ్యవహరించినట్లు తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి, జిల్లా కమిటీ ప్రతినిధులు అబ్రహాం లింకన్, రవూఫ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మరో 9 అసోసియేషన్ పదవులకు ఈనెల 7వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి. 148 మంది ఓటింగ్‌లో పాల్గొననున్నారు. కరుణాకర్, రఘునందన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఒక ప్యానెల్, శ్రీధర్, వైఎస్‌వీ ప్రసాద్‌లు మరో ప్యానెల్‌లో పోటీ చేస్తున్నారు. వీరి తరపున మరో 9మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ నుంచి పలువురు నాయకులు జిల్లాకు రానున్నారు. కరుణాకర్, రఘునందన్ ప్యానెల్‌ను జిల్లా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ బలపరుస్తోంది.

నేటి నుంచి ఆకాశవాణిలో భారతంలోని చిన్న కథలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆకాశవాణి కర్నూలు కేంద్రం నుంచి ప్రతి రోజు ఉదయం 7.15 గంటలకు ప్రసారం చేసే కాంతిరేఖలు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు భారతంలో వివిధ చిన్నకథలను నాటక రూపంలో ప్రసారం చేయనుందని ఆకాశవాణి కర్నూలు కేంద్ర సహాయ సంచాలకులు రొక్కా కామేశ్వరరావు తెలిపారు. గురుదక్షణ, ప్రమద్వర, మాతృదేవోభవ, కచదేవయాని, బ్రహ్మర్షి, జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం, గంగావతరణం, పరుశరాముడు, సుకన్య, అష్టవక్రుడు, ధర్మవ్యాధుడు, సతీసావిత్రి, దేవేంద్ర పదవి కథలను ప్రసారం చేస్తామని వివరించారు.

పోస్టర్ విడుదల



కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): ఈ నెల 10, 11, 12 తేదీల్లో తలపెట్టిన సీపీఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. స్థానిక సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు రాజగోపాల్, ఇక్బాల్ మాట్లాడుతూ టీడీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో తీర్మానాలు ఆమోదిస్తామన్నారు. జన్మభూమిలో పాల్గొనేందుకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలను పార్టీ శ్రేణులు సమస్యల పరిష్కా రం కోసం నిలదీయాలని పిలుపునిచ్చారు.

నేడు దేవాదాయశాఖ మినిస్టీరియల్ ఉద్యోగుల సమావేశం

కర్నూలు (న్యూసిటీ): దేవాదాయ ధర్మాదాయశాఖలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగుల సమావేశం 6వతేదీన పాత బస్టాండులోని నగరేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తామని రాష్ట్ర నాయకుడు కోటేశ్వరారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

మరికొన్ని జోన్ వార్తలు ..12వ పేజీలో ▶

- అరకొరగా వస్తున్న జనం కూడా సమస్యలపై నిలదీస్తున్న వైనం
- టీడీపీ వర్గీయులకే పథకాలంటూ ఆరోపణ
- చిన్నారుల నృత్యాలతో గడిపేస్తున్న అధికారులు
- 382 పంచాయతీలు, 123 వార్డుల్లో సభలు పూర్తి

జన్మభూమి సభలకు

నిరసన సెగ





జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు సభలో రేషన్‌కార్డు విషయంపై వాగ్వాదం చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్)ఆస్పరి మండలం బనవనూరులో ఈఓఆర్డీ వీర్రాజును నిలదీస్తున్న గ్రామస్తులు

కర్నూలు(అగ్రికల్చర్):

రోజులు గడుస్తున్నా జన్మభూమి గ్రామసభలకు నిరసనల సెగ తగ్గడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి జన్మభూమి కార్యక్రమం ప్రతి రోజు నిరసనల మధ్య సాగుతుండడం గమనార్హం. పోయిన విడతలో ఇచ్చిన వినతులు, దరఖాస్తులకే దిక్కులేకపోవడం, పథకాలను టీడీపీ కార్యకర్తలే తన్నుకుపోతుండడంతో జనంలో నిరసన వెల్లువెత్తుతోంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన గ్రామసభల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పటి వరకు 382 పంచాయతీలు, 123 వార్డుల్లో జన్మభూమి సభలు పూర్తయ్యాయి. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న ఈ కార్యక్రమంలోను జనాలు పలుచగా ఉంటున్నారు. డోన్, పత్తికొండ, ఓర్వకల్, ఆదోని, కోవెలకుంట్ల, ఆలూరు, ఆత్మకూరు, నందికొట్కూరు తదితర మండలాల్లో గ్రామసభలు నామమాత్రంగా సాగుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొంటున్న సభల్లో జనం హాజరు పర్వాలేనిపించినా మిగతా ప్రాంతాల్లో సభలు వెలవెలబోతున్నాయి. ఇప్పటి వరకు 50 వేలకుపైగా సమస్యలు సభల ద్వారా అధికారుల దృష్టికి వచ్చాయి.



గూడూరు: ఆరోవార్డు జన్మభూమి సభలో విద్యార్థుల నృత్యాన్ని తిలకిస్తున్న అధికారులు

- మొన్న మహానంది మండలం తమ్మడపల్లిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో గున్నా.. గున్నా.. మామిడి తదితర విద్యార్థుల పాటలతో పొద్దుపుచ్చిన వైనం మరువకముందే గూడూరులో శుక్రవారం ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. జనాలు లేకపోవడంతో పలువురు విద్యార్థులను జన్మభూమి గ్రామ సభకు పిలిపించి వారితో నృత్యం చేయించుకొని అధికారులు ఆనందించారు.
- ఆస్పరి మండలం బనవనూరులో పథకాలు అర్హులకు కాకుండా అధికార పార్టీ అనుచరులకే మంజూరు చేస్తున్నారంటూ జనం అధికారులపై విరుచుకుపడ్డారు. జన్మభూమి కమిటీలో కూడా టీడీపీ నేతలే ఉన్నారు.. అలాంటప్పుడు అర్హులకు పథకాలు ఎలా చేరతాయంటూ ప్రశ్నించారు. ప్రజలకు న్యాయం చేయలేనపుడు జన్మభూమి సభలెందుకంటూ ధ్వజమెత్తారు.
- నందికొట్కూరు మండలం 80 బన్నూరులో అర్హులకు పింఛన్‌లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయడం లేదని జన్మభూమి కమిటీ అధికారులపై జనం ప్రశ్నల వర్షం కురిపించారు. కమిటీ సభ్యులు సూచించిన వారికే ఇస్తున్నారని నిలదీశారు. ఇందుకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు.
- సీ.బెళగల్ మండలం పోల్‌కల్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య సభ సాగింది. అధికార పార్టీలోని ఇరువర్గాలవారు ఆదిపత్యం కోసం పోటీ పడ్డారు. ఇరు వర్గాల నేతలు మోహరించడం, వాదోపవాదాలు చోటు చేసుకోవడంతో ఆందోళనల మధ్య జన్మభూమి సభ నిర్వహించారు. అధికారులు సర్దిచెప్పినా ఇరువర్గాలు ఏమాత్రం వెనక్కుతగ్గకపోవడం గమనార్హం.

పిల్లలను ఉన్నతంగా చదివించుకోండి



జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ

నందికొట్కూరు: పిల్లలను ఉన్నతంగా చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులో సర్పంచ్ ఖలీలుల్లాబేగ్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ ప్రసంగించారు. బీసీ సంక్షేమ హాస్టల్‌కు వెంటనే మంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ చిన్నారులు జాతీయ జెండా రంగులతో చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. జెడ్పీ చైర్మన్ రాజశేఖర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాండ్ర శివానంద రెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమికి 40,545 దరఖాస్తులు

- 5,019 మందికి ఇళ్ల స్థలాలు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): జన్మభూమి కార్యక్రమంలో ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 40,545 దరఖాస్తులు వచ్చాయని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఇందులో ఒకే తరహా సమస్యలపై 9,862 అర్జీలు వచ్చాయన్నారు. జన్మభూమి సభల తీరు, దరఖాస్తులు, వాటి పరిష్కారంపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జన్మభూమి కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్ చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. గ్రామసభల్లో ఇప్పటి వరకు 30,263 రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. 5,019 మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని తెలిపారు. 49,903 గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించామన్నారు. 30,985 పశువులకు చికిత్స చేశామని వివరించారు. ఈ సమావేశంలో సీపీఓ ఆనంద్‌నాయక్ కూడా ఉన్నారు.

కన్నీరు పెట్టుకున్న మహిళ



అధికారుల ఎదుట ఏడుస్తున్న ఎద్దుల ప్రశాంతి

డోన్ రూరల్ : కుటుంబ పోషణ భారంగా మారిన నేపథ్యంలో ఓ వితంతు మహిళకు ఆసరాగా ఉన్న పింఛన్ రద్దు చేయించి అన్యాయం చేశారు. ఈ మేరకు శుక్రవారం డోన్ మండలం కమలాపురం గ్రామసభలో బాధితురాలు ఎద్దుల ప్రశాంతి అధికారుల ఎదుట కన్నీరు పెట్టుకుంది. 2017 సెప్టెంబర్‌లో ఆమె పింఛన్ రద్దయింది. భర్త చనిపోయి కుటుంబ పోషణ భారంగా మారిందని, పింఛన్ పునరుద్ధరించాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఏడుస్తూ అడుగుతుంటే అధికారులు ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ ఉండిపోయారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు చేస్తున్న పాపానికి ఇలాంటి వారు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారని ఈ సందర్భంగా గ్రామస్తులు మండిపడ్డారు. సర్పంచ్ మాట్లాడుతూ విషయం తనకు తెలియదని, అధికారులతో మాట్లాడి త్వరలో పింఛన్ ఇప్పిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

గత దరఖాస్తులకే దిక్కులేదు..!

– జన్మభూమి సభలో మంత్రి అఖిలను నిలదీసిన హరివరం వాసులు



హరివరం జన్మభూమి గ్రామసభలో మంత్రి అఖిలప్రియను ప్రశ్నిస్తున్న ముస్లింలు

ఉయ్యాలవాడ: 'మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన జన్మభూమి సభల్లో ఇక్కడే మా సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశాం.. ఇప్పుడు మంత్రిగా వచ్చారు.. అయితే అప్పటి సమస్యలే పరిష్కారం కాలేదు. వాటికే మళ్లీ దరఖాస్తులు అందజేయాలని సూచించడం సరికాదు' అని మండల పరిధిలోని హరివరం గ్రామస్తులు మంత్రి అఖిలప్రియను ప్రశ్నించారు. శుక్రవారం గ్రామసభకు హాజరైన మంత్రి అఖిల ప్రియతో గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు జన్మభూమి సభల్లో దరఖాస్తులు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. మసీదుకు చెందిన నాలుగెకరాల భూమి అన్యాక్రాంతమైందని, శ్మశాన వాటిక , ఈద్గా , ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం లేదంటూ పలువురు.. మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇంతవరకు అధికారులు స్పందిచకపోవడంలో ఆంతర్యమేంటని నిలదీశారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి ఉగాది పండుగ రోజు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎంపీపీ గాండ్ల మల్లేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి సుభద్రమ్మ, ఆర్‌డీఓ రామసుందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి విజయుడు, తహసీల్దార్ మోజెస్ ప్రసన్, ఎంపీడీఓ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.18 లక్షల చోరీ

– గంటలోనే దొంగను పట్టుకున్న పోలీసులు



దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అవుకు: మండల కేంద్రమైన అవుకులో రూ.2.18 లక్షలు చోరీ జరగగా..గంటలోనే పోలీసులు దొంగను పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకట్రామి రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని శివవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి స్థానికంగా వడ్ల వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో తనకు రావలసిన డబ్బు మండలంలోని మెట్టుపల్లె గ్రామానికి చెందిన కిట్టు అనే వ్యక్తితో ఇప్పించుకుని బైక్‌లో ఉంచుకున్నాడు. గాయత్రి రైస్‌మిల్‌లో వ్యక్తిగత పనిముగించుకుని వచ్చి బైక్‌లో చూడగా డబ్బు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు..రామచంద్రా రెడ్డి వెంట ఎవరెవరు తిరిగారో ఆరా తీసి నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన బోయ బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. తానే దొంగతనం చేసి వరిపొట్టులో డబ్బు దాచినట్లు చెప్పాడు. గంటలోనే దొంగను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ వెంకట్రామి రెడ్డి, సిబ్బందిని బనగానపల్లె సీఐ శ్రీనివాసులు అభినందించారు.

నేటి నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు) : ఏ క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ఖాజాహుసేన్, సత్యనారాయణరెడ్డి తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం మాంటిస్సోరి పాఠశాలలో విడుదల చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే దిశగా జనవిజ్ఞాన వేదిక 30 సంవత్సరాలుగా పనిచేస్తోందని వారు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ శనివారం ఉదయం పదిగంటలకు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభ సభ, సైన్స్‌టాక్ కార్యక్రమాలకు సీసీఎంబీ పూర్వ సంచాలకులు సీహెచ్ మోహన్‌రావు, ఎన్‌ఐటీ వరంగల్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య, అజర్‌బైజాన్‌లో పనిచేస్తున్న పర్యావరణ శాస్త్రవేత్త మోటూరు కృష్ణప్రసాద్ హాజరవుతారని తెలిపారు. 8వ తేదీన ముగింపు వేడుకలకు రాయలసీమ వర్సిటీ వీసీ వై.నరసింహులు, ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం తదితరులు హాజరవుతారన్నారు. సంబరాల్లో జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన కనబరచిన 13 జిల్లాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని వారు తెలిపారు.

అర్చకులపై అటెండర్ పెత్తనం!

- హారతి పళ్లెంలో వేసే కానుకల్లో వాటా కావాలంటూ పట్టు
- ఒప్పుకోక పోవడంతో కక్ష సాధింపు చర్యలు
- మూకుమ్మడి సెలవులో వెళ్లేందుకు నోటీసులు ఇచ్చిన అర్చకులు



ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో ఓ అటెండర్..అర్చకులపై పెత్తనం చెలాయిస్తున్నాడు. భక్తులు దయతలచి హారతి పళ్లెంలో వేసే కానుకుల్లో వాటా కావాలని పట్టుబడుతున్నాడు. వాటా ఇవ్వని పక్షంలో కక్ష గట్టి అర్చకులను వేధిస్తున్నాడు. హారతి పళ్లెంలో వేసే కానుకలను గుడిలో విధులు నిర్వహించే అర్చకుడు, పరిచారకులు ఇద్దరు సగం, సగం పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పంపకాల్లో కొంత మొత్తం (రూ. 100 వరకు) అక్కడ ఆ రోజు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఇస్తారు. అయితే ఈ మధ్యకాలంలో కానుకలు బాగా వస్తున్నాయని మంత్రి అనుచరుడిగా చెప్పుకుంటున్న ఓ అటెండర్ కొందరు సిబ్బందితో కలిసి ఆలయ అధికారికి ఆశలు రేకెత్తించారు. అధికారుల తరపున ఆ అటెండర్.. అర్చకుల దగ్గరకు వెళ్లి ఇక మీదట కానుకలు మూడు భాగాలు చేయాలని అందులో ఒక భాగం తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరు అర్చకులు అడ్డు చెప్పడంతో హారతి పళ్లెంలో వేసే కానుకలు అన్నీ హుండీలో వేయిస్తున్నారు. అంతే కాకుండా ప్రసాదాల తయారీకి అందించే నిధుల్లో భారీగా కోతలు విధించారు. దీంతో పూర్వం నుంచి చేస్తున్న ఆచార వ్యవహారాలు కొనసాగించలేక పోతున్నామని కొంతమంది అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర సరుకులతోనే ప్రసాదాలు తయారు చేసి స్వామికి నివేదిస్తూ, ఉభయదారులకు సర్దుతున్నారు. ఇంత జరుగుతున్నా మఠం ప్రతినిధులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆందోళనకు సిద్ధమవుతున్న అర్చకులు

ఎన్నడూ లేని విధంగా ఓ అటెండర్ పెత్తనం చలాయిస్తూ ఉండడంతో అర్చకులంతా మూకుమ్మడి నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. అర్చకులందరూ సంతకాలు చేసి రాత పూర్వకంగా అహోబిలం మఠం ప్రతినిధి సంపత్‌కు ఫిర్యాదు కూడా చేశారు. చర్యలు తీసుకోకపోతే వైదిక కార్యక్రమాలు నిలిపి గుడి ఎదుట నిరసనకు దిగాలని సమాయత్తమవుతున్నారు.

ఖర్చు ఎక్కువ అవుతోంది

కల్యాణం నిర్వహించే సమయంలో భక్తులు రూ.800తో కేసరి టికెట్ తీసుకుంటున్నారు. దేవస్థానానికి రూ. 2300 ఖర్చు అవుతోంది. దీంతో నష్టం వస్తుందని రూ. 800 మేరకు సరిపోయే సరుకులు మాత్రమే ఇస్తున్నాం.

– కామేశ్వరి, అహోబిలం ఈఓ

పిచ్చి కుక్క స్వైర విహారం

– 15 మందికి గాయాలు



బాధితురాలిని పరామర్శిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు : మండల పరిధిలోని గోకుల పాడు గ్రామంలో శుక్రవారం.. పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. జబ్బార్, సత్యం, గౌరు కాటంరెడ్డి, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, రోశన్న కుమారుడుతోపాటు 15 మందిని కరిచింది. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు పిచ్చికుక్కను చంపివేశారు. పిచ్చికుక్క దాడిలో రెండు ఆవులు కూడా గాయపడ్డాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

నిందితులపై కేసు నమోదు

వెల్దుర్తి: నార్లాపురం గ్రామానికి చెందిన భూమలు రైతులకు తెలియకుండా కర్నూలు కార్పొరేషన్ బ్యాంకులో ఆయకం పెట్టి దాదాను కోటి ఎనభై లక్షల రూపాయలను కొల్లగొట్టిన ఉదంతంపై పోలీసులు స్పందించారు. బాధిత రైతులు ఆంజనేయలు, మరికొంత మంది ఫిర్యాదు మేరకు 8 మందిపై శుక్రవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాజావలీ తెలిపారు. జయన్న ఆచారి, విజయ్ కుమార్, సుభాష్ చంద్ర బోస్, శ్రీనివాసులు, ఆంజనేయులు, సురేశ్‌బాబు, ప్రదీప్, వెంకటేశ్వరరావు తదితరులపై కేసు నమోదు చేశామన్నారు. పూర్వాపరాల విచారణ నిమిత్తం విచారణాధికారి డోన్ డీఎస్పీకి కేసును బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కర్నూలు : దండిగేరి వీధికి చెందిన జితేంద్ర (22) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తండ్రి శ్యామ్‌నాథ్ దండి గేరిలో కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు సంతానం. మొదటి కుమారుడు జితేంద్ర ఇంటర్ వరకు చదువుకున్నాడు. గురువారం సాయంత్రం బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి శుక్రవారం ఉదయం కేసీ కెనాల్‌లో శవమై తేలాడు. కర్నూలు శివారులోని కొండారెడ్డి నగర్‌లో స్నేహితులతో కలిసి మద్యం సేవించినట్లు స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే తాలూకా పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గౌస్ సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మద్యం మత్తులో కాల్వలో పడి చనిపోయాడా లేక ఉద్దేశపూర్వకంగానే ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

కేసీలో వ్యక్తి గల్లంతు

హత్యనా..ఆత్మహత్యనా?



గల్లంతైన గౌస్‌పీరా

బండిఆత్మకూరు: ఈర్నపాడు సమీపంలోని కేసీ కెనాల్‌లో శుక్రవారం.. ఓ వ్యక్తి గల్లంతవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌ఐ విష్ణు నారాయణ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం దేవనగర్ ప్రాంతానికి చెందిన గౌస్‌పీరాకు మహానంది మండలం గాజుపల్లెకు చెందిన కలిమద్దీన్ కుమార్తె మొబిన్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భార్యాభర్తల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ అతని మామ ప్రవర్తన మాత్రం సక్రమంగా ఉండేది కాదు. ఈ క్రమంలో శుక్రవారం మామతో కలిసి అల్లుడు.. ఓంకార క్షేత్రానికి బయలు దేరారు. మార్గమధ్యలో ఈర్నపాడు సమీపంలో ఉన్న కేసీకెనాల్‌లో గౌస్‌పీరా (30) గల్లంతు కావడంతో అనుమానాలు రేకెత్తాయి. తన సోదరున్ని హత్య చేసి నీళ్లల్లోకి తోసేసి ఉంటారని హాజీబాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామ కలిమద్దీన్ మాత్రం తన అల్లుడు ఉన్నఫలంగా కేసీలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తాను రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ నీటి ప్రవాహంలో గల్లంతైనట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి జిన్నింగ్ మిల్లులపై ఐటీ దాడులు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి జిన్నింగ్ మిల్లుల పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని రాయలసీడ్(మహాలక్ష్మి సీడ్)లో గురువారం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీ తాము సేకరించిన పత్తి, ఇతర విత్తనాలను కావేరి, నూజివీడు సీడ్ కంపెనీలకు సరఫరా చేస్తోంది. దాదాపు ఆరుగురు అధికారులు కలిగిన టీమ్ ప్రతినిధులు ఏఏ కంపెనీకి ఎంతెంత విత్తనాలు సరఫరా చేశారు... వాటి విలువ ఎంత... ఆదాయపు పన్ను చెల్లించారా తదితర వాటిని పరిశీలించారు. ఈ విషయం తెలిసి జిల్లాలోని పత్తి మిల్లులకు తాళాలు వేసుకొని యజమానులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

హత్యకేసులో జీవితఖైదు



జీవిత ఖైదు పడ్డ వారు

కర్నూలు(లీగల్): లారీ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున భారీ జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. సంజామలకు చెందిన దళిత నరసింహులు లారీ క్లీనర్‌గా డోన్ మండలం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ నవిబాషా వద్ద పని చేసేవాడు. హైదరాబాద్ నుంచి సిమెంట్ ఇటుకల లోడుతో 2013 జూలై 11వ తేదీ గుత్తికి వెళ్తూ అర్ధరాత్రి నిద్ర మత్తుగా ఉండడంతో పెద్దటేకూరు సమీపంలోని ఏయం రెడ్డి బొప్పాయి తోట వద్ద లారీ ఆపుకున్నారు. లారీలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి 1 గంట సమయంలో ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా లారీ క్యాబిన్‌లోకి చొరబడి కత్తి చూపించి డబ్బు ఇవ్వాలని లారీ డ్రైవర్ నవీబాషా (29)ను అడిగారు. తన వద్ద డబ్బు లేదని సమాధానం ఇవ్వగా అతనిని సిమెంట్ ఇటుకతో తీవ్రంగా గాయపరచగా అక్కడికక్కడ మృతి చెందాడు. క్లీనర్ నరసింహులు భయపడి తన రూ.300ను సెల్‌ఫోన్ ఇచ్చివేయగా అతనిని వదలి వేశారు. జరిగిన దారుణాన్ని ఉలిందకొండ పోలీసులకు నరసింహులు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో గూడూరు గ్రామానికి చెందిన రమేష్, మిన్నల్ల..కర్నూలు మార్కెట్‌యార్డ్‌లో పని చేస్తూ వచ్చే ఆదాయం చాలక హైవే రోడ్డుల్లో ఆగి ఉన్న వాహనాలపై దాడి చేసి డబ్బు దోచుకునేవారు. అదే రోజు దళిత నాయకంట రంగస్వామి ఆటోను మాట్లాడుకొని డోన్ వైపు వెళ్లి ఘాతుకానికి పాల్పడినట్లు అప్పటి తాలూకా సీఐ కె.శ్రీనివాసమూర్తి కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. కేసు విచారణలో ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి జి.అనుపమ చక్రవర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సుభాన్ వాదించారు.

రెండు కొండ చిలువలు హతం

–కోళ్లను తింటుండగా చంపేసిన గ్రామస్తులు



చంపిన కొండ చిలువలను చూపుతున్న గ్రామస్తులు

సంజామల: మండలంలోని కానాల గ్రామంలో రెండు భారీ కొండ చిలువలను గ్రామస్తులు హతమార్చారు. గ్రామంలోని బోయవీధి మునిరెడ్డి తోట కళ్ళంలోని కంపచెట్లలో శుక్రవారం వీటిని పొలానికి వెళుతున్న గురునాధరెడ్డి గమనించారు. రెండు కోళ్లను పట్టి మింగేస్తుండడాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కోళ్లను విడిపించేందుకు ఎంత ప్రయత్నం చేసినా లాభం లేకపోవడంతో అవి ఇళ్ల మధ్య ఉండడం ప్రమాదకరంగా భావించిన ప్రజలు వాటిని కొట్టి చంపేశారు.

స్వీపర్‌పై చెయ్యి చేసుకున్న ప్రిన్సిపాల్



బాధితురాలు చిన్న వెంకమ్మ

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వీపర్‌పై ప్రిన్సిపాల్ పీవీ హరిబాబు చేయి చేసుకున్నారు. ఈ మేరకు బాధితురాలు టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళాశాలలో 1994 నుంచి స్వీపర్‌గా మాదం శెట్టి చిన్న వెంకమ్మ విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి కళాశాలలో వేసిన లైట్లు ఎందుకు ఆర్పలేదని ప్రిన్సిపాల్ చేయిచేసుకున్నట్లు ఆమె తెలిపారు. కళాశాల నుంచి వెళ్లిపోకపోతే ఉద్యోగం నుంచి తీసివేస్తానని బెదిరించినట్లు ఆమె వాపోయారు. అయితే వెంకమ్మ తమకు మౌఖికంగా ఫిర్యాదు చేశారని, లిఖిత పూర్వకంగా చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. ఇదిలా ఉండగా కేసు పెట్టకుండా కొందను వ్యక్తులు రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

డోన్ టౌన్ : చెక్ బౌన్స్ కేసులో ఓ మహిళకు డోన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆంజనేయులు.. ఏడాది జైలుశిక్ష విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను న్యాయవాది మధుసూదన తెలిపారు. గురుదేవి అనే మహిళ వద్ద వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సుశీలమ్మ ..రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే సమయంలో బ్యాంకు చెక్కును ఇచ్చారు. చెక్కు గడువు తీరేవరకు బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయకపోవడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదన విన్న మెజిస్ట్రేట్ ఆంజనేయులు.. ఫిర్యాదుదారురాలికి వడ్డీతో రూ. 4.35 లక్షలను చెల్లించాలని లేదంటే ఏడాది జైలుశిక్ష అనుభవించాలని తీర్పునిచ్చినట్లు న్యాయవాది మధుసూదన్ తెలిపారు.

ప్రజా సంకల్ప యాత్ర

మనవడ్ని చూసినాం.. చాలు



'మా లాంటి వాళ్ల కోసం మా మనవడు (వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) ఎండల్లో నడిసొస్తాండాడంటే చూడాలని వచ్చినాం. ఆయన్ను చూసినాం. మా బాగోగులు అడిగినాడు. సొంత బిడ్డలా మాట్లాడినాడు. పెద్దాయన్ను (వైఎస్ రాజశేఖరరెడ్డి)ని దగ్గర నుంచి చూసినట్లుండాది. మా మనవడు అధికారంలోకి రాగానే ముసలోళ్లకంతా నెలకు రూ.2వేల పింఛన్ ఇస్తామన్నాడు. ఊరూరా ఇదే విషయం చెబుతాం. అందరూ దీవిస్తా ఉండాం. మా మనవడు కచ్చితంగా సీఎం అవుతాడు..' అంటూ కురబపల్లెకు చెందిన వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలోని గాండ్లపల్లె నుంచి పాదయాత్రగా బయలుదేరిన జననేత అక్కడే ఉన్న వృద్ధుల్ని కలిశారు. ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు అడగడంతో వృద్ధులు ఉప్పొంగిపోయారు. – చిత్తూరు అర్బన్

మాఫీ లేదు..పెట్టుబడీ లేదు



సాక్షి, చిత్తూరు : ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం చిత్తూరు జిల్లా సదుం మండలం గాండ్లపల్లెలో వరి రైతు సుధాకర్‌తో జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. రైతుతో కలిసి ధాన్యం తూర్పారబట్టారు. అనంతరం అన్నదాత కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏం అడిగారంటే..

జగన్: ఈ వరి ధాన్యం ఏ రకం?
రైతు: సోనామసూరి సార్
జగన్: ఎకరాకు ఎంత ఖర్చవుతుంది?
రైతు: రూ.30 వేల వరకు అవుతుందన్నా..
జగన్: ఎంత దిగుబడి వస్తుంది?
రైతు: 25 బస్తాల వరకు..
జగన్: ఖర్చులు పోను ఎంత మిగులుతుంది?
రైతు: ఏం మిగలట్లేదు సార్. 75 కేజీల బస్తా రూ.1000. ఇంకా రూ.5 వేలు చేతి నుంచే పడుతోంది. పాడి ఉండబట్టి ఇల్లు గడుస్తోంది.
జగన్: బ్యాంకులో ఎంత రుణం ఉంది? అప్పు మాఫీ అయ్యిందా?
రైతు : రూ.1లక్ష దాకా అప్పు ఉంది. ఒక్క రూపాయీ మాఫీ కాలేదు సార్. చంద్రబాబు నాయుడు మోసం చేసినాడు. బ్యాంకు నుంచి రెండు రోజులకొక సారి వడ్డీ అయినా కట్టాలని ఫోన్ వస్తా ఉండాది. పెట్టుబడులు చూసుకుందుమా..? అప్పులు కట్టుకుందుమా?. ఆ మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నపుడు రూ.50 వేల దాకా మాఫీ అయ్యింది
జగన్: పాలలో అయినా మిగులుతోందా?
రైతు: ఆడికాడికి సరిపోతా ఉండాది సార్..
జగన్: పాలు లీటర్‌కు రూ.4 రాయితీ ఇస్తామని హామీ ఇచ్చాం తెలిసిందా?
రైతు: తెలిసింది సార్. బాగుంది. పాలపై రాయితీ ఇస్తే చాలా మంచిది. రైతు భరోసా కింద రూ.12,500 ఇస్తారని కూడా తెలిసింది.



కదిలిన జగన్ సైన్యం



గాండ్లపల్లెలో రైతులు ప్రేమగా చుట్టిన తలపాగాతో జననేత జగన్‌మోహన్‌రెడ్డి



ఆనంద క్షణం..



అదిగదిగో అన్న..






తలపాగా ఇ



నవరత్నాలు తెస్తా : అకా






చెల్లెమ్మ అభివాదం..


జగనన్న అభిమానం..


రాజన్న బిడ్డను చూడాలని..


జనకెరటం : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని సదుంలో జరిగిన బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనం

ఉత్సాహం

గుండె నిండా సంకల్పం..
లక్ష్య సాధనపై పట్టుదల..
ప్రజలతో మమేకమవ్వాలనే బలమైన కాంక్ష..
ఎంచుకున్న మార్గంపై విశ్వాసం..
వెంట అనుసరిస్తున్న వేలాది జనం..

.. ఇవీ వైఎస్సార్‌సీపీ అధినేత..విపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నవ్యోత్సాహంతో పాదయాత్రలో ముందుకు నడిపిస్తున్న అంశాలు.. మొండైన ఆత్మవిశ్వాసంతో అలుపెరుగని ఆయన అడుగులు రాష్ట్ర చరిత్రను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం తొలి అడుగు పడింది మొదలు చీకటి పడ్డాక బస చేరేవరకూ జనం మధ్యే ప్రస్థానం.. రాజన్న వారసత్వంగా పుణికిపుచ్చుకున్న చెరగని చిరునవ్వు.. సామాన్యుడ్ని అక్కున చేర్చుకునే ప్రేమానురాగం ఈ సంకల్ప సూరీడి విశిష్టతలు. ఇవి చూసే చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పల్లె ప్రజలు తమ నాయకుడొచ్చాడని సంబరపడుతున్నారు.. ప్రేమతో అభిమానాలు కురిపిస్తున్నారు.

Praja Sankalpa Yatra



రైతు బిడ్డగా..

...లా చుట్టాలి..


అధైర్యపడొద్దు అండగా ఉంటా..

అభిమానం తోడుగా..

తాత కష్టం వింటున్న మనుమడు


...్కచెల్లెమ్మలకు భరోసా ఇస్తున్న జననేత


నేనున్నానని : దివ్యాంగుడికి ధైర్యంచెబుతూ..

అనురాగ హారతి

గాండ్లపల్లెలో హారతి పడుతున్న అక్కాచెల్లెమ్మలు

ఆత్మీయ సెల్ఫీ

జగనన్నతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

చిరు కానుక

యాదవ సంఘం నాయకుల కానుక

విన్నపాలు

కందూరు క్రాస్ వద్ద అక్కాచెల్లెమ్మల వినతి

మనువడి ఆప్యాయత

గాండ్లపల్లెలో తాతయ్యను పలకరిస్తూ..

దివ్యమైన భరోసా

సదుంలో దివ్యాంగుడితో మాట్లాడుతూ..

పాడి-పంట

ఆకుకూరల సాగు.. ఆదాయం బాగు

- వేసవిలో ఆకు కూరలకు మంచి డిమాండ్
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఉద్యానశాఖ సహాయ సంచాలకులు రఘునాథరెడ్డి సూచనలు



కర్నూలు అగ్రికల్చర్ :

ఆకుకూరల సాగులో రైతులు బాగా రాణించడానికి అవకాశముంది. భారత ఆహార సంస్థ, భారత వైద్య పరిశోధన మండలి సిఫారసు మేరకు ప్రతి ఒక్కరు కనీసం 125 గ్రాముల ఆకు కూరలు ప్రతిరోజూ ఆహారంలో భాగంగా తీసుకోవాలి. వాటిలో ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలైన ఇనుము, ఫోలిక్ ఆమ్లం మొదలైనవన్నీ లభిస్తాయి. ముఖ్యంగా ఈ రెండు పోషకాల లోపం వల్లనే గర్భిణులు, చంటి బిడ్డలు, యుక్త వయసు స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఆకు కూరల్లో ఈ పోషకాలతో పాటు విటమిన్ ఏ, సీలు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు లభిస్తాయి. వ్యవసాయ సీజన్ ముగియడంతో ప్రస్తుతం ఆకు కూరల కొరత ఏర్పడే అవకాశముంది. బావులు, బోర్లు, ఇతర నీటి పారుదల కింద ఇప్పుడు సాగు చేపట్టడం లాభదాయకమని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు రఘునాథరెడ్డి సూచించారు. ఈ నెల నుంచి వేసవి వరకు ఆకు కూరల సాగుకు అనువైన రకాలను ఆయన తెలియజేశారు. జిల్లాలో పాలకూర, తోటకూర, గోంగూర, చుక్కకూర, మెంతికూర, పుదీన, కొత్తిమీర, బచ్చలికూర వేసవిలో సాగుకు అనుకూలంగా ఉంటాయి.

తోటకూర : ఏఆర్ఎన్ఏ రకం ఆకులు కాండం లేత ఆకు పచ్చ రంగులో ఉంటాయి.ఇందులో విటమిన్ ఏ, సీలు అధికంగా ఉంటాయి. పీచు లేకుండా మృదువుగా ఉంటుంది. మొదటి కోత విత్తిన 15–20 రోజులకు వస్తుంది. పూసా లాల్ చౌలై రకం ఆకుల పై భాగం ముదురు ఎరుపు రంగులో, అడుగు భాగం నీలి ఎరుపు రంగులో ఉంటుంది. మొదటి కోత 24–30 రోజులకు వస్తుంది. వీటితో పాటు అర్క అరుణ, కో–1, 2, 3 రకాలను కూడా వేసవిలో సాగు చేయొచ్చు.

పాలకూర : ఆల్‌గ్రీన్ రకం లేత ఆకులను కలిగి 15–20 రోజుల్లో కోతకు వస్తుంది. 6 నుంచి ఏడు కోతల్లో ఎకరాకు 50 టన్నుల దిగుబడి వస్తుంది. అర్క అనుపమ కూడా వేసవిలో సాగుకు అనుకూలం.

గోంగూర : ఏఎన్‌జీఆర్‌యు–1 రకం ఇది ఎర్ర గోంగూర రకం. ఎకరాకు 4–5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎంఎస్–3 రకం కూడా ఎర్ర గోంగూర రకానికి చెందినదే. దీనిని కూడా తడికింద ఎప్పుడైనా సాగు చేయవచ్చు.

మెంతికూర : లాంసెలక్షన్–1 రకం గుబురుగా పెరుగుతుంది. ఎక్కువ ఆకు దిగుబడి ఇస్తుంది. పూసాఎర్లీ బంచింగ్ రకం కూడా తొందరగా కోతకు వస్తుంది. హిస్సార్ సువర్ణ రకం కూడా పూసాఎర్లీ బంచింగ్ కంటే 20 శాతం అధిక దిగుబడి వస్తుంది



కొత్తిమీర : స్వాతి(సీఎస్–6) పంట కాలం 80–85 రోజులు, సాధన(సీఎస్–4) రకం పంట కాలం 100–110 రోజులు ఉంటుంది. వీటితో పాటు కరివేపాకులో సువాసిని, డీడబ్ల్యూడీ–1, 2 రకాలు, బచ్చలిలో ఎర్రబచ్చలి, పుదీనాలో స్పియర్ మింట్ వంటి రకాలు సాగుకు అనుకూలం.

విత్తన మోతాదు : ఎకరాకు తోటకూర 800 గ్రాములు, పాలకూర 10–12 కిలోలు, గోంగూర 6 కిలోలు, మెంతికూర 8–10 కిలోలు, కొత్తిమీర 4.5 కిలోలు, బచ్చలికూర 5–6 కిలోల విత్తనాలు అవసరమవుతాయి.

విత్తే పద్ధతి : పాలకూర సాగుకు వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీ మీటర్లు ఉండాలి. గోంగూరకు వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీమీటర్లు, తోటకూరలో వరుసల మధ్య 20 సెంటీ మీటర్లు, మెంతికూరలో వరుసల మధ్య దూరం 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీ మీటర్లు, బచ్చలిలో వరుసల మధ్య దూరం 60 సెంటీమీటర్లు.. మొక్కల మధ్య దూరం 60 సెంటీ మీటర్ల ఉండాలి.

ఆకు కూరల్లో దిగుబడి పెంచడానికి మార్గాలు...

తక్కువ కాలపరిమితి, అధిక దిగుబడినిచ్చే రకాలు ఎంపిక చేసుకోవాలి. ఆరుతడి పంటగా సాగు చేయాలి. సమగ్ర ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను ఉపయోగించి విత్తనశుద్ధి చేయాలి.

అంతరకృషి : విత్తిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 2 నుంచి మూడు సార్లు కలుపు తీసి మట్టిని కదిలించాలి. విత్తే ముందు ఫ్లుక్లోరలిన్ కలుపు మందు 800 గ్రాములు ఎకరాకు వాడాలి.

సమగ్ర పోషక యాజమాన్యం

వేసవి ఆకు కూరల సాగుకు సాధ్యమైనంత ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడాలి. దీనివల్ల నేలలో తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచి.. సూక్ష్మ జీవుల చర్యలు అధికమై పోషకాల లభ్యత పెరుగుతుంది.

రక్షణ గోడ పనులు ప్రారంభం



రక్షణ గోడ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ ముందు భాగంలో రక్షణ గోడ నిర్మాణ పనులను రూ. 9.90 లక్షల అంచనా వ్యయంతో శుక్రవారం ప్రారంభించారు. గత ఆగస్టులో డ్యామ్ రేడియల్‌క్రస్ట్ గేట్లను తెరిచారు. ఆ సమయంలో నీటి తాకిడికి సందర్శకులు నిలబడే ప్రాంతమంతా కొట్టుకుపోయింది. దీంతో డ్యాం నిర్వహణ డివిజన్ అధికారులు రక్షణ గోడ పనులకు శ్రీకారం చుట్టారు. పూర్తి కాంక్రీట్ గోడను నిర్మించడంతో పాటూ రక్షణ వలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు డ్యామ్ డీఈ రత్నజయకర్ తెలిపారు.

కేసు తప్పుదోవ పట్టించే కుట్ర

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య



బాధితులతో కల్లూరి చెంగయ్య, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

ఆళ్లగడ్డ /ఆళ్లగడ్డ టౌన్: దళితుల గ్రామ బహిష్కరణ కేసును తప్పుదోవ పట్టించేందుకు పాలకులు, అధికారులు కుట్ర చేస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య ఆరోపించారు. దళితులు గ్రామ బహిష్కరణకు గురైన రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామాన్ని శుక్రవారం దళిత హక్కుల నిజనిర్ధారణ కమిటీ సభ్యులు సందర్శించి బాధితులతో మాట్లాడారు. 28 కుటుంబాలను వెలివేయగా..పాలకులు, అధికారులు మాత్రం రెండు కుటుంబాలను వెలివేసినట్లు చెబుతూ కేసును తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అధికారులు తాత్కాలికంగా సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. ఇంత జరిగినా జిల్లా మంత్రులు గ్రామాన్ని సందర్శించకపోవడం, ముఖ్యమంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. దీన్నిబట్టే దళితులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. బాధిత కుటుంబాల్లో ఇంటికో ఉద్యోగం, రెండెకరాల చొప్పున వ్యవసాయ పొలం, 12 ఎకరాల వెట్టి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ఓబులేసు, ఎనమద్ది నారాయణ, చెన్నమ్మ, సరోజ, మురళి, రవి, నారాయణ పాల్గొన్నారు.

‘దళితులను విధుల్లోకి తీసుకోవాలి’

అహోబిలంలో విధుల నుంచి తొలగించిన దళిత స్వీపర్లను, అటెండర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ అటెండర్ మాటలు విని ఒకేరోజు ఏడుగురు సిబ్బందిని ఎటువంటి విచారణ లేకుండా విధుల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.

కమ్యూనిజానికి అంతం లేదు

- ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే
- మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు

పత్తికొండ టౌన్: కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని బూర్జువా పార్టీలు చేస్తున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని, ఎన్నితరాలు మారినా కమ్యూనిజానికి అంతం లేదని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీజే చంద్రశేఖర్ రావు, పి. రామచంద్రయ్య అన్నారు. సీపీఐ పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల మహాసభలను శుక్రవారం పత్తికొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహం వద్ద నుంచి పాత బస్టాండు అంబేడ్కర్ సర్కిల్ వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక చదువులరామయ్య భవన్‌లో జరిగిన 3 మండలాల మహాసభల్లో నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర్యం రాకముందే ఏర్పాటైన పార్టీ సీపీఐ అని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పేద, కార్మిక, శ్రామిక వర్గాలకు అండగా ఉండి, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నట్లు వివరించారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, మహిళలు, ముస్లిం మైనార్టీలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పి.భీమలింగప్ప, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల శేఖర్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.నబీరసూల్, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండల కార్యదర్శులు కారన్న, వెంకటేశ్వర్లు, హనుమప్ప, పట్టణ కార్యదర్శి సురేంద్ర, సహాయకార్యదర్శి నెట్టి కంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

చాగలమర్రి: ప్రజా చైతన్యం కోసమే సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సెంట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల కలిగే ఉపయోగాలు ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ ర్యాలీ చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలైందని, ప్రతి రోజు వంద నుంచి 115 కిలోమీటర్లు కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో చేపట్టి.. ఈనెల 7వ తేదీన వైఎస్సార్ జిల్లాలో ము గిస్తామన్నారు. మొత్తం 1,168 కి.మీ చేపడుతున్నామని, ఎస్పీఎఫ్ సిబ్బ ంది 60 మంది ర్యాలీలో పాల్గొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి శంకరరావు, ఆళ్లగడ్డ డీఎస్పీ చక్రవర్తి , సీఐలు దస్తగిరిబాబు, అశోక్‌కుమార్, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

DRIVING SCHOOL

■మహిళలకు శుభవార్త! ఫ్రెండ్స్ డ్రైవింగ్ స్కూల్, కర్నూలు నగరంలో 2 వీలర్ శిక్షణ లేడీ ట్రైనర్ ద్వారా 9 సం॥లు అనుభవం గల మహిళ ద్వారా శిక్షణ ఇవ్వబడును. ఆషా–79972 71644, 79970 88037. [L-700562]

Education

ఇంటర్ పాస్/ఫెయిలైనా డిగ్రీ

■ నాగార్జున, గీతం, రాయలసీమ యూనివర్శిటీల దూర విద్య ద్వారా B.Sc, B.A (All), B.Com, DCA, CA, BBM, BCA, B.Com-Gen రెగ్యులర్ & డిస్టెన్స్. హాస్టల్ కలదు. శ్రీ విజయదుర్గ డిగ్రీ కళాశాల, కో–ఎడ్యుకేషన్, కర్నూలు. 93937 28410. [L-603994]

DISTNCE EDUCATION

■M.Sc Maths, Statistics, Computer, IT, Psychology, LLM, M.A., (Eng., Soc.) M.Com, MCA, MLIS, B.Com, BBA, BLIS. (10th / ఇంటర్ P/F) నాగార్జున యూనివర్సిటీ, గ్లోబల్ టెక్నో కంప్యూటర్ ఎడ్యుకేషన్, బళ్ళారి చౌరస్తా, నిర్మల్ నగర్, కర్నూలు 98857 77002. [L-700567]

COMPUTER EDUCATION

■ కేవలం Exam ఫీజుతో ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం. M.S.Office, DTP, Tally, Hardware, 'C'. ఈ రోజే సంప్ర: NICE COMPUTER EDUCATION, శ్రీరామ థియేటర్ ప్రక్కన, కర్నూలు. సెల్: 93968 61308. [L-700554]

ADMISSIONS

■10th పాస్ అయిన వారికి D.E.H.M. డిప్లొమా ఇంటర్ (ఎనీ గ్రూప్) పాస్ అయిన వారికి B.E.M.S. బ్యాచిలర్ E.H. మెడికల్ కోర్సులు కలవు. సంప్ర : 7661074143, 9398359238. [A-3910]

Real Estate

■కొత్త బస్టాండుకు దగ్గరలో వాయిదా పద్ధతిలో షాపులు అమ్మకానికి కలవు & కర్నూలుకు అతి సమీపంలో ఓపన్ ప్లాట్లు వాయిదాల పద్ధతిలో కలవు. గుత్తి పెట్రోల్ బంక్ నుండి 3 కి.మీ దూరంలో గేటెడ్ కమ్యూనిటీ హౌసెస్ కలవు. 33x40, బ్యాంక్ లోన్ కలదు. క్రిష్ణమూర్తి–95330 49765. [L-700548]

PLOT FOR SALE

■1 సెంటు 3,20,000/– మాత్రమే. కర్నూలు సిటీ మున్సిపాలిటీ పరిధిలో నందికొట్కూరు రోడ్డుకు కమ్మ సంఘం వెనుక చుట్టూ ఇండ్ల మధ్యలో 30x50 సైజు ప్లాట్లు కలవు. 90003 72379. [L-700569]

■ప్లాట్లు... ప్లాట్లు... ప్లాట్లు.. కొనబడును. అమ్మబడును. కొనిచ్చి అమ్మబడును. గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కు EMI కలదు. DTCP అప్రూవల్ ప్లాట్లకు మాత్రమే బ్యాంక్ లోన్ కలదు. సెల్: 81796 09214. [L-700552]

■శ్రీసాయి అమృత కాలనీ – 2: ఎయిర్‌పోర్ట్, ఉర్దూ యూనివర్సిటీ, సోలార్ హబ్, జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ మొదలగు వాటితో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ ప్రాంతం నందు హైవే నుండి సోలార్ ప్రాజెక్ట్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఆనుకొని 2.75 సెంట్ల ప్లాట్లు కేవలం రూ. 1,70,000/– లలో అమ్మకమునకు కలవు. 99853 43829. [L-700521]

FLAT FOR SALE

■కర్నూలు రేడియో స్టేషన్ వెనకాల యెలుకూరు బంగ్లాస్, 3వ అంతస్థు, వెస్ట్ ఫేస్, 2 బెడ్ రూం ఫ్లాట్ అన్ని వసతులతో 14 లక్షలకే అమ్మబడును. సంప్ర: 99856 72272. [L-700568]

HOUSE FOR SALE

■నందికొట్కూరు రోడ్ నందు గోపి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి శ్రీ కైలాసగిరి హోమ్స్ నందు డుప్లెక్స్ & ఇండిపెండెంట్ హౌసెస్ తక్కువ ధర, ఎక్కువ నాణ్యతతో అందిస్తున్నాము. 88863 23421 [L-603998]

■అంజనాద్రి టవర్స్ అపార్ట్‌మెంట్‌లో, 2 బెడ్‌రూం, 5వ ఫ్లోర్, కబోర్డ్స్ + POP, అన్ని వసతులతో ఫ్లాట్ అమ్మబడును. సనత్ నగర్, NDK రోడ్, నియర్ నంద్యాల చెక్‌పోస్టు, కర్నూలు. 98859 03499. [L-700572]

■అంజనాద్రి బిల్డర్స్ & డెవలపర్స్, కర్నూలు న్యూ కన్‌స్ట్రక్షన్ నందికొట్కూరు రోడ్డు, యెలుకూరు ఎస్టేట్స్ ప్రక్కన 2 BHK తూర్పు ఫేస్ ఇండ్లు కలవు. సెల్: 98859 03499. [L-700527]

■సాయికృప హోమ్స్: కర్నూలు నుండి కోడుమూరు రోడ్డులో రేడియో స్టేషన్ దగ్గర అన్ని వసతులతో, మున్సిపల్ అప్రూవల్ కలిగిన 2BHK ఇండిపెండెంట్ హౌసెస్ బ్యాంకు లోన్ సౌకర్యంతో అమ్మకమునకు కలవు. 99853 43829. [L-700522]

■సిద్దార్థ హోమ్స్ : కర్నూలు, బళ్లారి చౌరస్తాలో హనుమాన్ వేబ్రిడ్జి దగ్గర అన్ని వసతులతో మున్సిపల్ అప్రూవల్ కలిగిన 2BHK ఇండిపెండెంట్ హౌసెస్ బ్యాంక్‌లోన్ సౌకర్యంతో అమ్మక మునకు కలవు. 99853 43829. [L-700523]

■అమృత హోమ్స్: కర్నూలు, బి. తాండ్రపాడు నందు శ్రీ చైతన్య స్కూలు వెనకాల అన్ని వసతులతో, అప్రూవల్ కలిగిన 1BHK (13.5 లక్షల నుండి) మరియు 2BHK (19 నుండి 26 లక్షలలో) ఇండిపెండెంట్ హౌసెస్ బ్యాంకు లోన్ సౌకర్యంతో అమ్మకమునకు కలవు. సంప్ర: 99853 43829. [L-700524]

LAND FOR SALE

■ తిరుపతి to 7KM. NH-18 A కు 292 మీ॥ దూరంలో 1.15 ఎకరాలలో రెసిడెన్షియల్/ కమర్షియ ల్ ల్యాండ్ TUDA Limitsలో 30Fts. రోడ్‌తో అమ్మకానికి కలదు. 9573997225, 8500059810. [H-695863]

LEASE / RENT

■కర్నూలు – కల్లూరు, NH-7 హంద్రీబ్రిడ్జి దగ్గర, వాటర్ ట్యాంక్ ఎదురుగా సుమారు 22 సెంట్లు (70x150) 6 అడుగుల కాంపౌండు వాలు కల్గిన ఓపెన్ ప్లాటు అద్దెకు కలదు. 99592 50613. [L-700564]

Services

■న్యూ మార్కెటింగ్ టెక్నిక్స్ (ఆన్ & ఆఫ్ లైన్) పబ్లిసిటీ, సర్వేలు, క్రియేటివ్ యాడ్స్ కొరకు సంప్రదించండి: ఫోన్: 9618543767. [WB-42320]

BUSINESS SERVICES

LOANS

■ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులకు శుభవార్త! ప్రముఖ కంపెనీ యందు Plot Loans, Flats, Plot Cum Housing Loans కొరకు సంప్రదించండి. 98661 81835. [L-603999]

■కేవలం రూ. 1/– వడ్డీతో (గవర్నమెంట్ ఎంప్లాయిస్ & బిజినెస్ పీపుల్స్‌కు) లోన్స్ ఇవ్వబడును. (1 లక్ష నుండి 5 లక్షల వరకు) సంప్ర: ప్రేమ్, నంద్యాల, కర్నూలు – 70367 55734. [L- 700535]

GOLD FINANCE

■Gold Netic బంగారం బ్యాంకులో, తాకట్టు సంస్థలలో ఉన్నది విడిపించి కొత్తబంగారం ధరకు కొనబడును.మరియు గిఫ్ట్‌కూపన్ ద్వారా బహుమతులు గలవు. ✆ 96427 96420, 96427 96421 [O-617542]

BUSINESS OFFER

■మోను క్యాండిల్స్, నంద్యాల చెక్‌పోస్టు, కర్నూలు. ఇంట్లోనే ఉండి మైనపు వత్తులు తయారుచేసి, రోజుకు 400–800 వరకు సంపాదించే అవకాశం. అచ్చుమైనం, సప్లై చేయబడును. అగ్రిమెంట్ కలదు. 90595 81265 [L-700561]

■ 40 సం॥ చరిత్ర కల్గినటువంటి MNC (Multinational Company) లో Distributorలుగా గొప్ప అవకాశం. (No Investment). ✆ 90000 30040. [T-197]

■నిరుద్యోగులకు శుభవార్త! మీ సామర్థ్యం మీద మీకు నమ్మకం ఉందా Eazyspot. Com app listings ద్వారా డబ్బు సంపాదించుకునే అవకాశం కొరకు సంప్ర: 9100889946, 9100889947. [H-695590]

MARRIAGE SERVICES

■ఉచిత వివాహ సంబంధాలు. అన్ని కులాల సాఫ్ట్‌వేర్, గవర్నమెంట్ ఎంప్లాయిస్ వారికి మొదటి / 2వ వివాహాలు వయస్సుతో సంబంధం లేకుండా చూడబడును. R&B ఎదురుగా, సి. క్యాంపు. కర్నూలు. సెల్: 85007 40100, 81850 66448 [L-700518]

AYURVEDA

■శృంగార సమస్య శీఘ్రస్కలనం పలుచని వీర్యం, నరాల బలహీనత, అంగం వంకర & స్తంభించకపోవడం, ఈ సమస్యల కోసం మా గులికలు, క్రీమ్ & ఆయిల్ లింగవర్ధక యంత్రం ద్వారా పరిష్కారం పొందండి. 7539880120 [W-688271]

SEPTIC TANK

■సెప్టిక్‌ట్యాంక్ నిండినదా! కేవలం 10 ని॥లలో హై పవర్ మిషన్‌తో క్లీన్ చేయబడును & మినీ లారీలు బాడుగకు ఇవ్వబడును. శ్రీసాయి సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ & మినీ లారీ ట్రాన్స్‌పోర్ట్, బంగారుపేట, R.S.రోడ్, కర్నూలు. 94405 88660, 98492 29717. [L-603993]

Wanted

■నైస్ స్టడీ సర్కిల్ నందు వర్క్ చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కల్గిన లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. పూర్తి బయోడేటా, పాస్‌పోర్ట్ సైజు ఫొటోస్‌తో సంప్ర: STBC కాలేజ్ ఎదురుగా, కర్నూలు 92477 19478. [L-700573]

■జీవితంలో గెలవాలన్న తపన, పెట్టుబడి విద్యార్హత లేకుండగా పార్ట్/ఫుల్ టైంగా వర్క్ చేస్తూ నెలకు 20 వేలు సంపాదించే అవకాశం. స్త్రీ/పు లు సంప్ర: 80743 81259, 89194 34638. [L-700565]

■కర్నూలు అశోక్ నగర్ నందు అగర్‌బత్తిలు తయారు చేయు కంపెనీలో పని చేయుటకు 3 మహిళలు కావలెను. అశోక్‌నగర్‌కు దగ్గరలో ఉన్నవారికి ప్రాధాన్యత. 83419 16648. [L-700566]

■ప్రముఖ కంపెనీలో పార్ట్/ఫుల్ టైంగా నెలకు 10–25 వేల రూపాయలు సంపాదించే అవకాశం. ఏదైనా డిగ్రీ చేసిన స్త్రీ/పు వెంటనే సంప్ర: 90004 89614, 96184 82438. [L-700571]

■కర్నూలు టౌన్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు, టెలికాలర్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. అర్హతః 10th–పిజి, జీతంః 6–12 వేలు. సెల్ ః 88852 05554 [L-603996]

■SSC/INTER/Degree (P/F) అయి ఖాళీగా వున్న 39 మంది స్త్రీ/పులు కావలెను. జీః 10 వేలు+కమీషన్4200+ బోనస్+ ఫ్రీ రూం. 29 సం॥లోపు వారు సంప్ర. శ్రీనివాస టాకీస్ ఎదురుగా, కల్లూరు రోడ్డు, కర్నూలు. 95502 50229 [L-700555]

■(1) ఆఫీస్ అసిస్టెంట్ః ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి పూర్తిస్థాయి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండవలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. (2) అకౌంట్ అసిస్టెంట్ B.Com with Tally విద్యార్హత కలిగి అకౌంట్స్ నందు 2 సం॥ల అనుభవం ఉండవలెను. ఇంటర్వ్యూః 6.1.18. మేరు ఆటో మొబైల్స్, బాలాజీనగర్, కర్నూలు. 98663 10064 [L-603997]

■మా సంస్థనందు డెలివరి బాయ్స్‌గా పని చేయుటకు 2 వీలర్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన సంపాదన Cont: 74162 23111, 99662 38106 [G-676426]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ చేతి వ్రాత ద్వారా ప్రతివారం అధిక ఆదాయం, (అందరూ అర్హులే) సంప్రదించండి: మధు సాయి సర్వీసెస్. 7097286312, 7097286317. [H-695931]

■ పెద్ద వారికి సేవచేయుటకు యువతీ యువకులు వెంటనే కావలెను. జీతం: 10,000/– ఉచిత భోజనం+ వసతి. ECIL, Hyd. 9502192727, 9000165899. [HA-17107]

■బనగానపల్లె జీవన్ హోమియోస్టోర్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఫ్యాకల్టీ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర : 9010085974. [A-304]

■ ఉద్యోగాలు: కర్నూల్, ఆధోనిలో YMMC కంపెనీలో 10th,ఇంటర్,డిగ్రీ, 28 సం.లోపు యువతీ,యువకులకు ఉద్యోగ అవకాశాలు కలవు. నో ఫీ, రూం ఫ్రీ. ✆ 9177342337. [T-0890794]

■ప్రముఖ Ltd కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్లు, టీంలీడర్స్, ఇన్‌చార్జెస్, హెల్పర్స్, ప్యాకర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + రూం+భోజనం ఫ్రీ. Age : 18 to 35 సం॥. PH : 91005 93970,79976 63565. [V- 6164]

■మీ జిల్లాలోని LTD కంపెనీలకు సూపర్ వైజర్స్ హెల్పర్స్ ఇన్‌చార్జ్, టీం లీడర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, రూం+ భోజనం ఫ్రీ. 96406 56625, 96407 05668 [G-685]

■జాబ్ గ్యారెంటి మీ జిల్లాలో నూతనంగా ప్రారంభించిన కం॥లో సూపర్‌వైజర్లు, టింలీడర్స్, ప్యాకింగ్ బాయ్స్, హెల్పర్లు కావలెను. జీ॥10,000 పైన OT+బోనస్ 2వేలు రూం+మీల్స్ ఫ్రీ సం॥ 9703417043, 8367642170 [C-699302]

■ SSగ్రూపు కం॥లో Allసూపర్‌వైజర్స్, B.Sc. కెమిస్ట్రీ, హెల్పర్స్, అర్జెంటుగా కావలెను. జీ: 13,000–16,000,రూం+మీసౌకర్యం.Qly: 5th - డిగ్రీ, S.S. గ్రూప్ 2–4–1033, సమత పురి కాలనీ, Hyd. 9553632447, 9553633437. [H-695588]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సింది గా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేరుశనగ కొనుగోలు నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లో మద్దతు ధరతో వేరుశనగ కొనుగోలును నిలిపివేస్తూ ఆయిల్‌ఫెడ్ ఎండీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొనుగోలు చేసిన వేరుశనగను నిల్వ చేసేందుకు గోదాములు లేక పోవడం, ఖాళీ సంచుల కొరత తదితర కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు కొనుగోలు జరప రాదని జిల్లా అయిల్ ఫెడ్ అధికారులను ఆదేశించారు.

హంద్రీ-నీవాలో గుర్తు తెలియని మృతదేహం



వెల్దుర్తి: మండల పరిధిలోని హంద్రీ– నీవా కాలువ మల్లెపల్లె పంపింగ్ స్టేషన్–3 వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. హంద్రీనీవా అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఖాజావలీ మృతదేహాన్ని వెలికి తీయించారు. వయస్సు 35 సంవత్సరాల ఉండవచ్చని, ఒంటిపై దుస్తులు లేవని, చిరిగిన అండర్‌వేర్ మాత్రమే ఉందని ఎస్‌ఐ తెలిపారు. హత్యోదంతం లాంటి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సంబంధీకులు గుర్తించే నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు మార్చురీలో ఉంచినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



అంగన్‌వాడీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఆర్డీఓ ఓబులేసు

ఆదోని రూరల్: మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త అనంత లక్ష్మీ.. బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటిదగ్గర ఉన్న డీలర్ ఉసేనమ్మతో ఈమెకు విభేదాలు ఉన్నాయి. ఈ కారణంతో పురుగుల మందు తాగి శుక్రవారం.. సూసైడ్ నోట్‌తో స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. పరిశీలించిన పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ ఓబులేసు, తహసీల్దార్ శ్రీనాథ్..బాధితురాలిని పరామర్శించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి డీలర్ ఉసేనమ్మపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ ఉసేన్ బాషా తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

కర్నూలు సిటీ:

నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ వీసీ డాక్టర్.వై. నరసింహులు సూచించారు. జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్య వికాసంపై కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీవీ. రాజేశ్వరి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్లు ఎం ఫామిదాబేగం, ఆర్ వినోలియా, వి.విం ధ్యవాసిని దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కేవీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ డాక్టర్ వై. నరసింహులు

- కేవీఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి వై.పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- స్థానిక టౌన్ మెడల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ హరినాథ్‌రెడ్డి, డీవీఈఓ సుబ్రమణ్యేశ్వరరావు, ఆర్‌ఐఓ వై.పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డా కె.చెన్నయ్య పాల్గొని ఓడీఎఫ్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.
- శ్రీ బాలశివ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛభారత్, ఓడీఎఫ్‌పై ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.రామిరెడ్డి ర్యాలీని ప్రారంభించారు.
- బీక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జోహరాపురంలో ర్యాలీని ప్రిన్సిపాల్ కె.గాంధీ ప్రారంభించారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

కర్నూలు: మద్యం షాపులు, లాడ్జీల ఎదుట ఫోర్ మెగాపిక్సల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మూడో పట్టణ సీఐ సుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం సాయంత్రం సర్కిల్ పరిధిలోని లాడ్జీలు, మద్యం దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పోలీసులకు సహరించాలని కోరారు.

7న చంద్రుడు సంస్మరణ సభ

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.చంద్రుడు గతనెల 14న గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనెల 7న సంస్మరణ సభను నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించే సభకు రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు హాజరవుతారని చెప్పారు.

సెక్యూరిటీ గార్డుల దీక్షకు ఆటో యూనియన్ మద్దతు

కర్నూలు (టౌన్): వేతనాలు చెల్లించాలని ఆరు రోజులుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరాహార దీక్ష చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు శుక్రవారం ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు మద్దతు ప్రకటించారు. యూనియన్ నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదన్నారు.

రాష్ట్రస్థాయి గణిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కర్నూలు సిటీ: స్థానిక సిస్టర్ స్టాన్సిలా స్కూల్ విద్యార్థి ఇటీవల నెల్లూరులో జేవీవీఎంఈఈ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్సు, గణిత పోటీల్లో ప్రతిభ చూపిందని హెచ్ఎం సలోమి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్.పి. పాయల్ అనే విద్యార్థి గణిత ప్రాజెక్టు రాష్ట్రం నుంచి ఈ నెల 7వ తేదీన హైదరాబాదులోని దక్షిణ భారత సదరన్ ప్రదర్శనకు ఎంపికైందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందించారు.

ఉచిత ఎలక్ట్రీషియన్ శిక్షణ

కర్నూలు సీక్యాంప్: చదువుతో ఎలాంటి సంబంధం లేకుండా యువతీ, యువకులకు సప్తగిరినగర్‌లోని ట్రెడ్జ్ ఐటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యాలయంలో ఉచిత ఎలక్ట్రీషియన్ శిక్షణ ఇస్తామని సంస్థ కో–ఆర్డినేటర్ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10,11,12 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. 18ఏళ్ల నిండిన వారు ఆధార్ కార్డ్, 4పాస్‌ఫోటోలతో కార్యాలయంలో హాజరుకావాలన్నారు. ఈ మూడు రోజుల ట్రైనింగ్‌లో గౌరవ భృతి రూ.500 వందలు ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా స్కిల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఇస్తామని ప్రకటించారు.

7న 5కే రన్

కర్నూలు (టౌన్): ఈనెల 7వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక సీ క్యాంపు సర్కిల్ నుంచి 5కే రన్ (బాలురు) నిర్వహిస్తామని జిల్లా జూనియర్ కళాశాలల అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి. హర్షవర్ధన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రన్‌ను కలెక్టర్ సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. విజేతలకు రూ.10 వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ కార్యాలయం పునఃప్రారంభం

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో రేంజ్–3 డీఐజీ కార్యాలయాన్ని బెటాలియన్స్ డీఐజీ జి.విజయ్ కుమార్..శుక్రవారం పునః ప్రారంభించారు. 11వ బెటాలియన్ కమాండెంట్ రాజకిషోర్ బాబు, 14వ బెటాలియన్ కమాండెంట్ జగదీశ్‌రావు, రెండో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ అల్లాబకాష్, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.ఎం.బాషా, డీఎస్పీ సుప్రజ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


ఆధునీకరించిన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఐజీ విజయ్‌కుమార్

వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక మలబార్ గోల్డ్, డైమండ్స్ షో రూంలో శుక్రవారం అన్‌కట్ వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పన రెడ్డి పాల్గొని ప్రదర్శనను ప్రారంభించారు. ఆమె ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 15 వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. తరుగు చార్జీలపై 40 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ షానిబ్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న సాయికల్పన రెడ్డి

కార్డుకు 2 కేజీల బియ్యం తక్కువ

కర్నూలు (ఓల్డ్‌సిటీ): ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్లు కొందరు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కోసిగి మండలం కోల్‌మాన్‌పేట డీలర్..కార్డుకు రెండు కేజీల బియ్యం తక్కువ వేస్తూ తూనికలు కొలతల శాఖ అధికారులు చిక్కాడు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జె.మహమ్మద్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించగా.. పది కేజీలకు గాను రెండు కేజీల బియ్యం తక్కువ తూకం వచ్చింది. ఆ రేషన్‌షాప్‌పై కేసు నమోదు చేసి, రూ. 15 వేల అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో సహాయ సిబ్బంది హనుమాన్ సింగ్, వెంకటేష్, లతీఫ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లా స్థాయి విలువిద్య క్రీడాకారుల ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీన విలువిద్య క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 11, అండర్ 12, అండర్ 14, అండర్ 17 ,అండర్ 19 విభాగాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 50 ప్రవేశరుసుం చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9393855460 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదానం ప్రారంభం



కర్నూలు(న్యూసిటీ): పాత బస్టాండ్‌లోని శ్రీశైలం దేవస్థానం సత్రంలో శివ స్వాముల అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో శివ మాలధారులకు అన్నదాన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని కర్నూలు ఎమ్మెల్యే ఎస్.వి.మోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్‌రెడ్డి, అన్నదాన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లగిసెట్టి విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈ.కుమార్, శ్రీశైల ప్రభామాస పత్రిక సహాయ సంపాదకుడు సత్యబ్రహ్మచారి, అన్నదాన కమిటీ కార్యదర్శి గోవిందరాజులు, మధుశేఖర్ పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కర్నూలు : బుధవారపేటకు చెందిన మట్కా బీటర్లు షేక్ షబ్బీర్, సయ్యద్‌ఫరీద్‌లను అరెస్ట్ చేసి రూ.20వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి..శుక్రవారం విలేకరులకు తెలిపారు. అలాగే జోహరాపురం అల్లాబకాష్ దర్గా వద్ద మట్కా జరుగుతున్న సమాచారం అందడంతో శుక్రవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో షేక్‌సలీం, షేక్ వహీద్‌ల వద్ద మట్కా చీటీలతో పాటు రూ.1,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల పై నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

7న ధనుర్మాస వైశిష్ట్యం

కర్నూలు(న్యూసిటీ): నగరంలోని ఉద్యోగ నగర్‌లోని వరసిద్ది వినాయకస్వామి దేవాలయంలో ఈనెల 7వ తేదీన సాయంత్రం 6.15 గంటలకు ధనుర్మాసం విశిష్టతపై ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తామని పద్య కళాస్రవంతి ప్రతినిధి యర్రంశెట్టి జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

కర్నూలు(కొండారెడ్డి ఫోర్టు): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం ఆయన చాంబర్‌లో జేసీ ప్రసన్న వెంకటేష్, ఇరిగేషన్ సీఈ నారాయణరెడ్డి, డ్వామా పీడీ సీహెచ్ పుల్లారెడ్డి, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ నారాయణ, ఎం.నాగేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు.

యాదవులు చైతన్యం కావాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాంపుల్లయ్య యాదవ్, సంఘం నాయకులు

కర్నూలు(న్యూసిటీ) : యాదవులు చైతన్యం కావాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాం పుల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బంగారుపేటలో ఉన్న జిల్లా యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు యాదవ్, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంగారు మారెప్ప యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీపీ కృష్ణమూర్తి, కోశాధికారి ఆర్.రామకృష్ణ యాదవ్, నాగరాజు యాదవ్, దండు శేషుయాదవ్, కేసీ రాముడు యాదవ్, పీజీ రామాంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయవాదుల ఆధ్వర్యంలో..


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. న్యాయవాదులు టి.నాగభూషణం నాయుడు, సీపీ మద్దిలేటి, కె.కపిలేశ్వరయ్య, బి.గోపాలకృష్ణుడు, ఎంవీ చక్రపాణి, శశికుమార్, రామకృష్ణ, నరసింహులు, బాల లక్ష్మయ్య, ఆంజనేయులు, కె.వెంకటేశ్వర్లు, బి.కె.రామశేషన్న తదితరులు పాల్గొన్నారు.

'చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తోంది ఆకాశం'



గంగనపల్లె వెంకటరమణ
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు),
జెడ్పీహెచ్ఎస్, పి.వి.జి. పల్లె,
పుల్లంపేట, వైఎస్ఆర్ కడప జిల్లా

4. వెన్నెల

సామర్థ్యం: 1. అవగాహన- ప్రతిస్పందన

♦ కింది పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి. *4 మార్కులు*

సూచనలు:

1. అన్వయక్రమాన్ని పాటిస్తూ, క్రియా పదంతో ముగించి నందుకు 1 మార్కు.
2. అన్ని పదాలకు సరైన అర్థాలు రాసినందుకు (సంధి పదాలను విడదీసి రాయాలి) 3 మార్కులు.

**1. సురుచిర తారకా కుసుమ శోభి నభోంగణభూమిc గాలమ
న్గరువపు సూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపcగ నిశాసతి కెత్తిన క్రొత్తతోcపుc బెం
దెర యన నొప్పె సాంధ్య నవదీధితి పశ్చిమ దిక్తటంబునన్**

ప్రతిపదార్థం:

సురుచిర = చాలా అందమైన
తారకా = చుక్కలనే; కుసుమ = పూల చేత
శోభి = అలంకరించిన
నభః + అంగణ భూమిన్ = ఆకాశమనే రంగస్థలం (వేదిక)పై
కాలము + అన్ = కాలమనే
గరువపు = గొప్ప;
సూత్రధారి = సూత్రధారి (దర్శకుడు)
జతనంబున = ప్రయత్న పూర్వకంగా
దిక్పతి కోటి = దిక్పాలకుల సమూహం
ముందటన్ = ముందు (ఎదుట)
సరసముగా = చక్కగా (యుక్తంగా)
నటింపగ = నాట్యం చేయడానికి సిద్ధపడిన
నిశాసతికి = రాత్రి అనే స్త్రీకి
ఎత్తిన = నిలిపిన (పట్టిన)
క్రొత్త = కొత్తదైన; తోcపున్ = ఎర్రని
పెన్ + తెర = పెద్ద తెర; అనన్ = అన్నట్లుగా
పశ్చిమ దిక్ + తటంబునన్ = పడమటి తీరంలోని (పడమటి దిక్కున)
సాంధ్య = సంధ్యకు సంబంధించిన (సంధ్యాకాలపు)
నవ దీధితి = కొత్త వెలుగు
ఒప్పెన్ = ప్రకాశించింది

♦ **కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించి, భావాలను రాయండి.** ***4 మార్కులు***

సూచనలు:

1. పాదభంగం లేకుండా పద్యాన్ని పూరించినందుకు (4 × ½) 2 మార్కులు.
2. సరైన భావం రాసినందుకు 2 మార్కులు మొత్తం.

1. 'దెసలను కొమ్మ లొయ్య .... సముత్సుకాకృతిన్' అనే పద్యాన్ని పూరించి, భావాన్ని రాయండి.

పద్యం:

**దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం
బెసcగcగ నూcది నిక్కి రజనీశ్వరుc డున్నతలీలc బేర్చు నా
కస మను పేరి భూరుహము కాంత నిరంతర తారకా లస
త్కుసుమ చయంబు గోయుటకొకో యనc బ్రాcకె
సముత్సుకాకృతిన్**

భావం: దిక్కులనే కొమ్మలతో, ప్రకాశించే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తోంది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పూవులను అందుకునేందుకా అన్నట్లు చంద్రుడు మిక్కిలి ఉత్సాహంతో విజృంభించాడని ఎర్రన వర్ణించాడు.

సామర్థ్యం : 2. వ్యక్తీకరణ (స్వీయ రచన)

♦ లఘు సమాధాన ప్రశ్నలు. *2 మార్కులు*

1. **వెన్నెల పాఠ్యాంశాన్ని రచించిన కవి గురించి రాయండి.**
కవి: ఎఱ్ఱా ప్రెగ్గడ (ఎఱ్ఱన) **కాలం:** 14వ శతాబ్దం
రచనలు: భారతంలో అరణ్య పర్వ శేషం, హరివంశం, నృసింహపురాణం,రామాయణం మొదలైనవి.
బిరుదులు: శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు
శైలి: ఎఱ్ఱన రచనలో వర్ణనలు అధికంగా ఉంటాయి. తరువాతి కాలంలోని కవుల వర్ణనకు ఎఱ్ఱన వర్ణనలే ప్రేరణనిచ్చాయి.
ఇతర విషయాలు: కవిత్రయంలో మూడవవాడు ఎఱ్ఱన. ఈయన గురువు శంకరస్వామి. తల్లిదండ్రులు పోతమాంబిక, సూరనార్యులు. ఎఱ్ఱన అద్దంకిని రాజధానిగా చేసుకొని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి.

2. వెన్నెల పాఠ్యాంశ నేపథ్యాన్ని రాయండి.
హిరణ్యకశిపుడు వనవిహారం చేసిన సందర్భంలో వసంత ఋతువును, సాయం సమయాన్ని, చంద్రోద యాన్ని ఎఱ్ఱన వర్ణించాడు. రోజంతా తీవ్రమైన ఎండను ప్రసరింపజేసిన సూర్యుడు ఇంకా ఉష్ణ తాపాన్ని పెంచితే అసుర నాయకుడైన హిరణ్యకశి పుడు సహింపడేమో అన్నట్లు నెమ్మదిగా పక్కకు తొలగిపోయాడు. ఆ తర్వాత ప్రకృతిలో వచ్చిన మార్పులను వర్ణించడమే ఈ పాఠ్యాంశ నేపథ్యం.

3. కావ్య ప్రక్రియను గురించి రాయండి.
ఎఱ్ఱన రచించిన 'వెన్నెల' పాఠ్యాంశం కావ్య ప్రక్రి యకు చెందింది. ప్రాచీన తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కావ్య ప్రక్రియ ఒకటి. ఇందులో వర్ణనలు ఎక్కువగా ఉంటాయి. కావ్యాల్లో శృంగార, భక్తి, వీర రసాలకు, కథాకథనానికి ప్రాధాన్యం ఉంటుంది. నృసింహ పురాణం, హరివంశం మొదలైనవి ఎఱ్ఱన కావ్యాలు.

4. వెన్నెలను వర్ణించడానికి కవి ఏయే అంశాలను ఎన్నుకున్నాడో తెల్పండి.
కవిత్రయంలో మూడవ వాడు ఎఱ్ఱన. ఈయన తన నృసింహపురాణంలో వెన్నెలను ఎంతో రమణీయంగా వర్ణించాడు. వెన్నెల తెల్లగా ఉంటుంది. కాబట్టి ధవళ వర్ణాన్ని సూచించే పాలసముద్రం, ప్రకాశిస్తున్న చంద్ర బింబం, సరస్సులో విచ్చుకున్న కలువపూలు, చంద్ర కాంత శిలలు, అందమైన స్త్రీల చిరునవ్వుల కాంతి అనే అంశాలను ఎన్నుకొని కవి వెన్నెలను వర్ణించాడు.

5. 'కాటుక గ్రుక్కినట్టి కరవటంబన జగదండఖండ మమరె' ఈ మాటలు కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించండి.
సాయం సంధ్యా సమయంలో ఆకాశంలో దట్టంగా వ్యాపించిన చీకటిని వర్ణిస్తున్న సందర్భంలో కవి ఎఱ్ఱన పలికిన మాటలివి. అధికమైన చీకటి కారణంగా కంటికి ఏమీ కనిపించడం లేదు. ఇది ఎట్లా ఉందంటే దిక్కులు, ఆకాశం, భూమి ఒకదానిలో ఒకటి కలిసి పోయి, బాగా కాటుక నింపిన భరిణె (కరవటంబు) లాగా విశ్వమంతా నల్లగా ఉందని కవి పేర్కొన్నాడు. కవి ఊహ నిజంగా అద్భుతం.

♦ **మరికొన్ని మాదిరి ప్రశ్నలు**

6. పున్నమి నాటి చంద్రబింబాన్ని చూస్తే చంద్రుడిలో ఏమేమి ఉన్నట్లుగా మీరు అనుభూతి చెందుతారు?
7. పౌర్ణమి నాటి కలువలను చూస్తుంటే మీకు కలిగే ఆనందం ఎలా ఉంటుందో ఊహించి రాయండి.
8. వెన్నెలను చూసిన కలువలు ఎలా ప్రతిస్పందించాయో మీ పాఠం ఆధారంగా రాయండి.
9. చంద్రుడు తన వెన్నెలతో ప్రపంచానికి ఆహ్లాదాన్ని ఎలా కలిగించాడని ఎఱ్ఱన వర్ణించాడు?

♦ **మాదిరి వ్యాసరూప సమాధాన ప్రశ్నలు. 5 మార్కులు**

1. వెన్నెల పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. (లేదా)



2. వెన్నెల విస్తరించిన విధానాన్ని మీ సొంతమాటల్లో రాయండి. (లేదా)
3. రాత్రి అనే ఆలోచన రానీయక, చీకటి అనే పేరును విననీయక ఆనంద తరంగంలా విస్తరించిన వెన్నెల విజృంభణను మీ సొంతమాటల్లో రాయండి.

సామర్థ్యం : 3. భాషాంశాలు (పద జాలం)

♦ **కింది పదాలను సొంతమాటల్లో ఉపయోగించి రాయండి.**

1. స్మిత కాంతి = చిరునవ్వుల వెలుగు
ఇంటికి వచ్చిన అతిథులను స్మితకాంతితో పలకరించాలి.
2. దివి = ఆకాశం
సూర్యచంద్రులు దివిలో ప్రయాణిస్తారు.
3. మిక్కుటం = ఎక్కువ
పెద్దనోట్ల రద్దు కారణంగా పేద ప్రజలు మిక్కుటంగా బాధలు పడ్డారు.
4. రజనీకర బింబం = చంద్ర బింబం
పౌర్ణమి నాటి *రజనీకరబింబం* ఎంతో ఆనందాన్నిస్తుంది.

నానార్థాలు

1. వెల్లి = ప్రవాహం, పరంపర, పాలవెల్లి
2. కుండలి = పాము, నెమలి, వరుణుడు
3. నిట్టవొడుచు = ఉప్పొంగు, విజృంభించు, రోమాంచితమగు

పర్యాయ పదాలు

1. చాడ్పు = విధం, భంగి, రీతి, తీరు
2. వెల్లి = ప్రవాహం, వెల్లవ
3. కైరవం = కలువ, కల్హారం, కుముదం, ఇందీవరం
4. కౌముది = వెన్నెల, చంద్రిక, జ్యోత్స్న
5. చంద్రుడు = ఇందుడు, శశాంకుడు, నిశాకరుడు
6. తమస్సు/తమం= చీకటి, ఆంధ్యం, అంధకారం, ఇరులు

ప్రకృతులు-వికృతులు

1. సంధ్య – సంజ; 2. దిశ – దెస
3. ధర్మము – దమ్మము 4. రాత్రి – రాతిరి
5. నిశ – నిసి 6. గౌరవము – గారవము
7. యత్నము–జతనము 8. చంద్రుడు–చందురుడు

వ్యాకరణాంశాలు

♦ **కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి**

1. రజనీశ్వరుడు = రజని + ఈశ్వరుడు –సవర్ణదీర్ఘ సంధి
2. చంద్రికాంబోధి = చంద్రిక + అంబోధి –సవర్ణదీర్ఘ సంధి
3. సముత్సుకాకృతిన్ = సముత్సుక + ఆకృతిన్ –సవర్ణదీర్ఘ సంధి
4. దివసేంద్రుడు = దివస + ఇంద్రుడు –గుణ సంధి
5. కాంతోపలంబులు = కాంత + ఉపలంబులు –గుణ సంధి
6. తలమెక్కి = తలము + ఎక్కి –ఉత్వ సంధి
7. చంద్రుడుదయించె = చంద్రుడు + ఉదయించె –ఉత్వ సంధి
8. ఖండమమరె = ఖండము + అమరె –ఉత్వ సంధి
9. దీర్ఘములైన = దీర్ఘములు + ఐన –ఉత్వ సంధి
10. ధీరంబైన = దీరంబు + ఐన –ఉత్వ సంధి
11. అత్యంత = అతి + అంత –యణాదేశ సంధి
12. వంటాముదము = వంట +ఆముదము –అత్వ సంధి
13. ఏమనిరి = ఏమి + అనిరి –ఇత్వ సంధి
14. అవ్విధంబున = ఆ + విధంబున –త్రిక సంధి
15. చనదొరు = చనదు + ఒరు –ఉత్వ సంధి

♦ **కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసాలను పేర్కొనండి.**

1. నలుదెసలు = నాలుగు సంఖ్య గల దెసలు –ద్విగు సమాసము
2. సూర్యచంద్రులు= సూర్యుడునూ, చంద్రుడునూ –ద్వంద్వ సమాసము

♦ **కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణ సమన్వయం చేయండి.**

అభినుతేందు చంద్రికాంబోధి యఖిలంబు నీట నిట్టలముగ నిట్టవొడిచె.
– ఇందులో రూపకాలంకారం ఉంది.
ఇక్కడ వెన్నెల (చంద్రిక) అనే సముద్రము (అంబుధి) నుంచి చంద్రుడు (అభినుత + ఇందు) నిండుగా (నిట్టలముగా) ఆవిర్భవించాడు (నిట్టవొడిచె) అని చెప్పడం జరిగింది. ఉపమేయమైన వెన్నెలకు ఉపమా నమైన సముద్రానికి అభేదం చెప్పబడింది. కాబట్టి ఇది రూపకాలంకారం.

పద్యాలు – లక్షణాలు

♦ **తేటగీతి:**

1. ఇది ఉపజాతి పద్యం. నాలుగు పాదాలు ఉంటాయి
2. ప్రతిపాదంలో ఒక సూర్యగణం, రెండు ఇంద్ర గణాలు, మరలా రెండు సూర్య గణాలు వస్తాయి. (సూర్యుడొక్కరుండు, సురరాజులిద్దరు, దినకర ద్వయంబు తేటగీతి)
3. ప్రతిపాదంలో ఒకటో అక్షరానికి నాలుగో గణ మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది.
4. ప్రాస నియమం ఉండదు.

♦ **ఆటవెలది:**

1. ఇది ఉపజాతి పద్యం. నాలుగు పాదాలు ఉంటాయి
2. ఒకటి, మూడు పాదాల్లో వరసగా మూడు సూర్య గణాలు, రెండు ఇంద్ర గణాలు ఉంటాయి.
3. రెండు, నాలుగు పాదాల్లో ఐదు సూర్యగణాలే ఉంటాయి. (ఇన గణ త్రయంబు, ఇంద్ర ద్వయంబు హంస పంచకంబు ఆటవెలది)
4. ప్రతి పాదంలో ఒకటో అక్షరానికి నాలుగో గణ మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది. యతి లేని చోట ప్రాస యతి ఉంటుంది.
5. ప్రాస నియమం ఉండదు.

‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ‘అక్షరాజ్య కూటమి’లోని దేశాలేవి?
   1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
   2) ఇటలీ, జర్మనీ, జపాన్
   3) అమెరికా, చైనా, స్పెయిన్
   4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్
2. ‘కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా’ తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
   1) బీజింగ్ 2) నాన్‌కింగ్
   3) షాంఘై 4) పెకింగ్
3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
   1) నైస్ 2) టస్కనీ
   3) సార్డీనియా 4) వెనిస్
4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన ‘కెమాల్’ అంటే?
   1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
   3) రక్షకుడు 4) విమోచకుడు
5. కింది వాటిలో సరైన జత ఏది?
   1) హిట్లర్ ఆత్మహత్య -1945
   2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
   3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
   4) పైవన్నీ సరైనవే
6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
   1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
   3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషి
7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
   1) చైనా – బ్రిటన్
   2) జర్మనీ – ఆస్ట్రియా
   3) జపాన్ – అమెరికా
   4) ఫ్రాన్స్ – ఇటలీ
8. ‘చైనా జాతి పిత’ అని ఎవరిని పిలిచారు?
   1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
   3) చూటే 4) మావో సే టుంగ్
9. రెండో విక్టర్ ఇమ్మానుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
   1) సార్డీనియా 2) ఫ్లోరెన్స్
   3) వెనిస్ 4) సెవాయ్
10. ‘నల్లచేయి’ అనే గుర్తు ఉన్న ‘నరోరా ఒబ్రానా సంస్థ’ ఏ దేశ విప్లవ సంస్థ?
    1) బోస్నియా 2) సెర్బియా
    3) ఆస్ట్రియా 4) మొరాకో
11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
    1) పీపుల్స్ అబ్జర్వర్
    2) ఇల్ రిసార్జిమెంటో
    3) ఇస్క్రా 4) అవంతి
12. ‘మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది’ అని అన్నదెవరు?
    1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
    3) మొదటి విలియం
    4) నెపోలియన్ బోనాపార్టే
13. ఆస్ట్రియా యువరాజు ‘ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్’ను ఎక్కడ హత్య చేశారు?
    1) సరాజెవో 2) వార్సా
    3) బెర్న్ 4) జెనీవా
14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే ‘కంకార్డేట్’ అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
    1) పోప్ 10వ లియో
    2) పోప్ 6వ అలెగ్జాండర్
    3) పోప్ 7వ ఫయిస్
    4) పోప్ 5వ ఫయిస్
15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
    1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
    3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్
16. ‘యుద్ధం ప్రష్యన్‌ల జాతీయ పరిశ్రమ’ అని అన్నదెవరు?
    1) డాంటన్ 2) మిరాబూ
    3) రాబిస్పియర్ 4) లఫాయితే
17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
    1) ఎర్ర చొక్కాల దళం
    2) నల్ల చొక్కాల దళం
    3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
    4) యంగ్ ఇటలీ సంస్థ
18. జపాన్‌లో ‘షింటో’ ప్రాచీన మతం. ‘షింటో’ అంటే?
    1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
    3) దేవతల మార్గం
    4) దైవ శాపగ్రస్థ దేశం
19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
    1) 1769 ఆగస్టు 15
    2) 1779 జనవరి 26
    3) 1789 మార్చి 19
    4) 1766 అక్టోబర్ 14
20. ‘ఆసియా ఆసియావాసులకే’ అనే నినాదం ఏ దేశానిది?
    1) జపాన్ 2) చైనా
    3) భారత్ 4) శ్రీలంక
21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
    1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
    2) రెండో జస్టీయన్‌గా కీర్తి పొందాడు
    3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
    4) పైవన్నీ సరైనవే
22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
    1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
    3) పోర్చుగీస్‌వారు 4) డచ్చీవారు
23. నెపోలియన్ బోనాపార్టే ‘భూఖండ విధానం’ ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
    1) ప్రష్యా 2) ఇంగ్లండ్
    3) రష్యా 3) ఆస్ట్రియా
24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్‌ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
    1) ఇంగ్లండ్ 2) రష్యా
    3) ఫ్రాన్స్ 4) చైనా
25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
    1) 1932 2) 1934
    3) 1936 4) 1938
26. ‘బ్లడ్ అండ్ ఐరన్’ పాలసీ సృష్టికర్త ఎవరు?
    1) జోసెఫ్ మాజినీ
    2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
    3) ఆటోవాన్ బిస్మార్క్
    4) మూడో నెపోలియన్
27. ‘స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది’ అని అన్నదెవరు?
    1) లెనిన్ 2) స్టాలిన్
    3) అడాల్ఫ్ హిట్లర్
    4) బెనిటో ముస్సోలినీ
28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) జెనీవా 2) న్యూయార్క్
    3) బెర్లిన్ 4) మాస్కో





29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన ‘రహస్య పోలీస్ దళం’ ఏది?
    1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
    3) గెస్టాపో 4) ఆగ్‌పూ
30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
    1) 1918 2) 1920
    3) 1922 4) 1924
31. ‘ప్రాచ్య విజ్ఞాన కోశం’ అని ఏ దేశాన్ని పిలుస్తారు?
    1) శ్రీలంక 2) జపాన్
    3) చైనా 4) బర్మా
32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
    1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంప్
    3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
    4) దాస్ కాపిటల్
33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
    1) వెనిస్ 2) మిలాన్
    3) ఫ్లోరెన్స్ 4) రోమ్
34. ‘కార్బోనరీ’ అంటే?
    1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
    3) బొగ్గును కాల్చేవారు
    4) యుద్ధ ఖైదీలు
35. ‘టర్కీ టర్కులకే’ అనే నినాదం ఇచ్చిందెవరు?
    1) ఇస్మత్ ఇనోను
    2) ముస్తాఫ కెమాల్ పాషా
    3) అలీ ఫతేహ ఒక్యార్
    4) జెనిటో జౌరజ్
36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
    1) 1815 2) 1817
    3) 1819 4) 1821
37. కింది వాటిలో సరైన జత ఏది?
    1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
    2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
    3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
    4) పైవన్నీ సరైనవే
38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
    1) 1941 డిసెంబర్ 7
    2) 1942 డిసెంబర్ 17
    3) 1943 ఆగస్టు 16
    4) 1944 మార్చి 19
39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
    1) సూర్యుడు, నాగలి
    2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
    4) పుల్లల మోపు, గొడ్డలి
40. ‘ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ’ అని ఎవరిని పేర్కొంటారు?
    1) మాజినీ 2) గారీబాల్డీ
    3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ
41. చైనాలో ‘బాక్సర్ తిరుగుబాటు’ ఎప్పుడు జరిగింది?
    1) 1900 2) 1902
    3) 1904 4) 1906
42. కింది వాటిలో సరైన జత ఏది?
    1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
    2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
    3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
    4) పైవన్నీ సరైనవే
43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
    1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
    3) షాట్ 4) వాన్‌రూన్
44. ‘మెయిజీ’ అంటే?
    1) విజ్ఞతతో వ్యవహరించడం
    2) నియంతృత్వ పాలన
    3) పెద్ద భూస్వామ్య వర్గం
    4) దైవలోక చక్రవర్తి
45. చౌఎన్‌లై ప్రధానిగా ‘ప్రజా రిపబ్లిక్’ ఏ దేశంలో ఏర్పడింది?
    1) జపాన్ 2) చైనా
    3) ఆస్ట్రియా 4) ప్రష్యా
46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్స్‌లర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
    1) 1862 2) 1864
    3) 1866 4) 1868
47. ‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’ అని అన్నదెవరు?
    1) మొదటి విలియం
    2) 16వ లూయి 3) ముత్సుహిటో
    4) నెపోలియన్ బోనాపార్టే
48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
    1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
    3) డెన్మార్క్, ఆస్ట్రియా
    4) ఫ్రాన్స్, ఆస్ట్రియా
49. ‘ఐరోపా జబ్బు మనిషి’ అని ఏ దేశానికి పేరు ఉంది?
    1) జర్మనీ 2) టర్కీ
    3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్
50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
    1) పోలాండ్ 2) డెన్మార్క్
    3) రష్యా 4) ఆస్ట్రియా
51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
    1) 1914-1918 2) 1915-1918
    3) 1914-1917 4) 1914-1924
52. ‘బ్యాటిల్ ఆఫ్ నేషన్స్’ అని ఏ యుద్ధానికి పేరు?
    1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
    3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం
53. ‘పొడెస్టాస్ అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
    1) జర్మనీ 2) ఇటలీ
    3) ఆస్ట్రియా 4) రష్యా
54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
    1) కైరో 2) అంకారా
    3) గాల్లిపోలి 4) టోక్యో
55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
    1) జెరోమ్ 2) టాలీరాండ్
    3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్
56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
    1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
    3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం
57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
    1) శాసనోల్లంఘనోద్యమం
    2) సహాయ నిరాకరణోద్యమం
    3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
    4) క్విట్ ఇండియా ఉద్యమం
58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
    1) పూయీ 2) షియోవాంగ్టీ
    3) యువాన్ 4) ముత్సుహిటో
59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
    1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
    3) జనరల్ మెకార్థర్
    4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	

నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుల్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.

గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్టు సైన్స్ డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫైడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సజావుగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు వేయండి








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పూరించండి



పైన కొన్ని బాక్సులు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లిష్ పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎదురుపైన కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!




పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



RP-Sanjiv Goenka Group

spencer's

Sankranti

Sambaralu

Great deals. Extra savings.

Bigger celebrations!

₹25/kg
(కనిష్ట బిల్లు విలువ ₹499 పైన)
స్పెన్సర్స్ ట్రస్టెడ్ వాల్యూ పంచదార లూజ్
Market Price ₹45/kg
(Maximum 2kg/bill. Valid till 7th Jan '18)

₹399
MPP ₹999
(కనిష్ట బిల్లు విలువ ₹999 పైన)
డైన్‌స్మార్ట్ స్టైల్‌ఆన్ డిన్నర్ సెట్ (24 units)

₹5
Market Price ₹10/kg
టొమాటో కంట్రీ

₹63
Market Price ₹71/kg
రెగ్యులర్ కందిపప్పు లూజ్

₹865
MRP ₹1299
రిచ్ రిచ్ న్యూ సోనా మసూరి బియ్యం 25kg

₹999
MRP ₹1300
సోనా మసూరి పాప్యులర్ బియ్యం 25kg

₹299
MRP ₹452
దావత్ రోజానా బాసుమతి బియ్యం 5kg

₹189
MRP ₹230
ఆశీర్వాద్ గుండు గోధుమపిండి 5kg

₹84 + పొందండి ₹30 విలువకలిగిన 100g ఆశీర్వాద్ పసుపు ఉచితంగా*
(3 కొనుగోలుపై)
MRP ₹109
ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ నూనె పౌచ్ 1L

₹455 + ఆశీర్వాద్ పసుపు + కారం+ ధనియాల పొడి 200g ఒక్కొక్కటి ₹142 విలువైనవి ఉచితయా*
MRP ₹550
ఫ్రీడమ్ సన్‌ఫవర్ నూనె జార్ 5L

₹82+ పొందండి ₹30 విలువకలిగిన 100g ఆశీర్వాద్ పసుపు ఉచితంగా*
(3 కొనుగోలుపై)
MRP ₹106
ఫ్రీడమ్ రైస్ బ్రాన్ నూనె 1L

25% తగ్గింపు
(2 వస్తువుల కొనుగోలుపై)
చింతపండు శ్రేణి

కొనండి ఏవైనా 4 పొందండి 1 ఉచితం*
MRP ₹15-100
(ఎంపిక చేయబడిన శ్రేణిలో)
బిస్కట్లు 72-400g

20% తగ్గింపు
(3 వస్తువుల కొనుగోలుపై)
MRP ₹35
(ఎంపిక చేయబడిన శ్రేణిలో)
లేస్ చిప్స్ 58-100g

పొందండి 70g విలువగల 1 మాగీ మసాలా నూడిల్స్ ఉచితంగా*
MRP ₹65
మాగీ 2-మినిట్ నూడిల్స్ మసాలా 420g

ఆదా ₹25
MRP ₹290
సన్‌రైజ్ కాఫీ పౌచ్ 200g

2Bme
FLAT 60% OFF* ON SELECT APPAREL
NOW IN STORES

25% తగ్గింపు
MRP ₹135-399
(ఎంపిక చేయబడిన శ్రేణిలో)
స్కిన్ క్రీమ్/బాడీ లోషన్స్ 100-400ml

ఆదా ₹150
MRP ₹400-500
(ఎంపిక చేయబడిన శ్రేణిలో)
షాంపూ 640-675ml

ఆదా ₹130
MRP ₹499/449
ఏరియల్ ఫ్రంట్ లోడ్ / టాప్ లోడ్ డిటర్జెంట్ పౌడర్ 2kg

₹99
MRP ₹199
ఎఫ్ ప్లెయిన్ ఫ్లీస్ రగ్గు సింగిల్ 360g

₹14990
MRP ₹24999
వెస్టన్ 32 (80cm) స్మార్ట్ ఎల్ఇడి టీవి

CIN. U51229WB2000PLC154278

Pay here with MobiKwik Save 10%

Up to ₹100 Paytm Cashback

GET 15% CASHBACK* PhonePe

GET 10% CASHBACK* airtel Payments Bank

*T&C apply. MRP inclusive of all taxes. Images shown here are for representation only, actual product may differ in appearance. Spencer's reserves the right to withdraw, change or modify the T&C as well as offers/prices without any prior notice. Offer valid till stock lasts. Spencer's reserves the right on process of passing offer in the invoices. All the offers communicated will be offered as value discounts in the customers invoice. Staples, fruits & vegetable offers valid till 7th Jan '18.

Offers valid at select stores of Kurnool.

Follow us on
Customer Care No.
1800 266 0134
www.spencersretail.com

జన ఉత్సాహం

Praja Sankalpa Yaatra

మనవడ్ని చూసినాం.. చాలు



'మా లాంటి వాళ్ల కోసం మా మనవడు (వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) ఎండల్లో నడిసొస్తాండాడంటే చూడాలని వచ్చినాం. ఆయన్ను చూసినాం. మా బాగోగులు అడిగినాడు. సొంత బిడ్డలా మాట్లాడినాడు. పెద్దాయన్ను (వైఎస్ రాజశేఖరరెడ్డి)ని దగ్గర నుంచి చూసినట్లుండాది. మా మనవడు అధికారంలోకి రాగానే ముసలోళ్లకంతా నెలకు రూ.2వేల పింఛన్ ఇస్తామన్నాడు. ఊరూరా ఇదే విషయం చెబుతాం. అందరూ దీవిస్తా ఉండాం. మా మనవడు కచ్చితంగా సీఎం అవుతాడు..' అంటూ కురబపల్లెకు చెందిన వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలోని గాండ్లపల్లె నుంచి పాదయాత్రగా బయలుదేరిన జననేత అక్కడే ఉన్న వృద్ధుల్ని కలిశారు. ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు అడగడంతో వృద్ధులు ఉప్పొంగిపోయారు. – చిత్తూరు అర్బన్



గాండ్లపల్లెలో రైతులు ప్రేమగా చుట్టిన తలపాగాతో జననేత జగన్‌మోహన్‌రెడ్డి

మాఫీ లేదు..పెట్టుబడీ లేదు



సాక్షి, చిత్తూరు : ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం చిత్తూరు జిల్లా సదుం మండలం గాండ్లపల్లెలో వరి రైతు సుధాకర్‌తో జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. రైతుతో కలిసి ధాన్యం తూర్పారబట్టారు. అనంతరం అన్నదాత కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏం అడిగారంటే..

జగన్: ఈ వరి ధాన్యం ఏ రకం?
రైతు: సోనామసూరి సార్
జగన్: ఎకరాకు ఎంత ఖర్చవుతుంది?
రైతు: రూ.30 వేల వరకు అవుతుందన్నా..
జగన్: ఎంత దిగుబడి వస్తుంది?
రైతు: 25 బస్తాల వరకు..
జగన్: ఖర్చులు పోను ఎంత మిగులుతుంది?
రైతు: ఏం మిగలట్లేదు సార్. 75 కేజీల బస్తా రూ.1000. ఇంకా రూ.5 వేలు చేతి నుంచే పడుతోంది. పాడి ఉండబట్టి ఇల్లు గడుస్తోంది.
జగన్: బ్యాంకులో ఎంత రుణం ఉంది? అప్పు మాఫీ అయ్యిందా?
రైతు : రూ.1లక్ష దాకా అప్పు ఉంది. ఒక్క రూపాయీ మాఫీ కాలేదు సార్. చంద్రబాబు నాయుడు మోసం చేసినాడు. బ్యాంకు నుంచి రెండు రోజులకొక సారి వడ్డీ అయినా కట్టాలని ఫోన్ వస్తా ఉండాది. పెట్టుబడులు చూసుకుందుమా..? అప్పులు కట్టుకుందుమా?. ఆ మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నపుడు రూ.50 వేల దాకా మాఫీ అయ్యింది
జగన్: పాలలో అయినా మిగులుతోందా?
రైతు: ఆడికాడికి సరిపోతా ఉండాది సార్..
జగన్: పాలు లీటర్‌కు రూ.4 రాయితీ ఇస్తామని హామీ ఇచ్చాం తెలిసిందా?
రైతు: తెలిసింది సార్. బాగుంది. పాలపై రాయితీ ఇస్తే చాలా మంచిది. రైతు భరోసా కింద రూ.12,500 ఇస్తారని కూడా తెలిసింది.



కదిలిన జగన్ సైన్యం



ఆనంద క్షణం..



అదిగదిగో అన్న..



చెల్లెమ్మ అభివాదం..



జగనన్న అభిమానం..



రాజన్న బిడ్డను చూడాలని..



జనకెరటం : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని సదుంలో జరిగిన బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనం

గుండె నిండా సంకల్పం..
లక్ష్య సాధనపై పట్టుదల..
ప్రజలతో మమేకమవ్వాలనే
బలమైన కాంక్ష..
ఎంచుకున్న మార్గంపై విశ్వాసం..
వెంట అనుసరిస్తున్న వేలాది జనం..

.. ఇవీ వైఎస్సార్‌సీపీ అధినేత..విపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నవ్యోత్సాహంతో పాదయాత్రలో ముందుకు నడిపిస్తున్న అంశాలు.. మొండైన ఆత్మవిశ్వాసంతో అలుపెరుగుని ఆయన అడుగులు రాష్ట్ర చరిత్రను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం తొలి అడుగు పడింది మొదలు చీకటి పడ్డాక బస చేరేవరకూ జనం మధ్యే ప్రస్థానం.. రాజన్న వారసత్వంగా పుణికిపుచ్చుకున్న చెరగని చిరునవ్వు.. సామాన్యుడ్ని అక్కున చేర్చుకునే ప్రేమానురాగం ఈ సంకల్ప సూరీడి విశిష్టతలు. ఇవి చూసే చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పల్లె ప్రజలు తమ నాయకుడొచ్చాడని సంబరపడుతున్నారు.. ప్రేమతో అభిమానాలు కురిపిస్తున్నారు.

రైతు బిడ్డగా..



తలపాగా ఇలా చుట్టాలి..



నవరత్నాలు తెస్తా : అక్కాచెల్లెమ్మలకు భరోసా ఇస్తున్న జననేత



అధైర్యపడొద్దు అండగా ఉంటా..



నేనున్నానని : దివ్యాంగుడికి ధైర్యంచెబుతూ..

అభిమానం తోడుగా..



తాత కష్టం వింటున్న మనుమడు

అనురాగ హారతి



గాండ్లపల్లెలో హారతి పడుతున్న అక్కాచెల్లెమ్మలు

ఆత్మీయ సెల్ఫీ



జగనన్నతో సెల్ఫీ తీసుకుంటున్న చెల్లెమ్మ

చిరు కానుక



యాదవ సంఘం నాయకుల కానుక

విన్నపాలు



కందూరు క్రాస్ వద్ద అక్కాచెల్లెమ్మల వినతి

మనవడి ఆప్యాయత



గాండ్లపల్లెలో తాతయ్యను పలకరిస్తూ..

దివ్యమైన భరోసా



సదుంలో దివ్యాంగుడితో మాట్లాడుతూ..